



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్



కాంగ్రెస్ పదవులకు.. పోటాపోటీ!



- 2017కు ముందు పార్టీలో పని చేసిన వారికే పదవులు వచ్చే అవకాశం
- పార్టీ అధిష్ఠానం పెద్దలు నిర్ణయించినట్లు జోరుగా ప్రచారం
- సీనియార్టీ ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల భర్తీకి అవకాశం
- డీసీసీ పీఠంపై భారీ ఆశలు పెట్టుకున్న పలువురు నేతలు
- సీనియర్లకు భరోసా, జూనియర్ నేతల్లో మొదలైన హైటెన్షన్
- జిల్లా పార్టీ పరిస్థితులపై ఆరా తీస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం నేతల మధ్య పోటాపోటీ కనిపిస్తోంది. పదవులను కేటాయించేందుకు పార్టీ అధిష్ఠానం డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తుంది. 2017కు ముందు పార్టీలో పని చేసిన వారికే నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులను కేటాయించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్‌లో 2017 ఏడాది హాట్‌టాపిక్‌గా మారింది. 2014లో అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్‌లో తిరిగి అధికారాన్ని చేపట్టింది. పదేళ్ల పాటు అధికారంలో లేకపోవడంతో ముఖ్య నేతలంతా పార్టీని వీడి చెల్లాచెదురై పోయారు. మళ్లీ అధికారంలోకి రాగానే పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో పార్టీలో సీనియర్, జూనియర్ నేతల మధ్య ఆధిపత్య పోరుకు దారి తీస్తుంది. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర గడుస్తున్నా.. ఇప్పటి వరకు జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల జోలికే వెళ్లలేదు. దీంతో అధిష్ఠానం నిర్ణయం కోసం ఆశావహ నేతలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఏప్రిల్ 28న జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశానికి రాష్ట్ర పీసీసీ పరిశీలకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హందన్, చిట్ల సత్యనారాయణలు హాజరయ్యారు. త్వరలోనే నామినేటెడ్ పదవుల నియామకాన్ని చేపడుతామని ప్రకటించారు. కాగా, ముఖ్యనేతల అభిప్రాయాలు సేకరించకుండానే సమావేశాన్ని ముగించినట్లు పార్టీలో చర్చ సాగుతోంది.


సీనియార్టీతో గందరగోళం

నామినేటెడ్ పదవులను కేటాయించేందుకు సీనియార్టిని పరిగణలోకి తీసుకుంటే గందరగోళ పరిస్థితులకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్న ఒకరిద్దరు సీనియర్లు తప్ప అంతా ప్రజాధారణ ఉన్న నేతలెవరూ పార్టీలో కనిపించడం లేదు. అలాగే సామాజిక వర్గాల వారీగా పదవులను కేటాయిస్తే నేతల కొరత తప్పదంటున్నారు. పార్టీ ఇన్‌చార్జిలను కూడా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉండదంటున్నారు. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పీఠంతో పాటు గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ చైర్మన్, ఆలయ చైర్మన్ పదవులు నియమించాల్సి ఉంది. అయితే సీనియార్టి ప్రతిపాదనతో సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ పట్టుతప్పే అవకాశం ఉందంటున్నారు. ప్రజాధారణ ఉన్న నేతకు నామినేటెడ్ పదవిని కట్టబెడితే పార్టీకి మరింత బలం చేకూర్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 80 శాతం మంది పోటీ నుంచి తప్పుకునే అవకాశం ఉంటుంది. సీనియర్, జూనియర్ అనే విబేదాలు లేకుండా పార్టీని ముందుకు నడిపించే వారికే పదవులను కేటాయిస్తే పార్టీకి కొంత వరకైనా న్యాయం జరిగే అవకాశం ఉందంటున్నారు.



రేసులో పలువురు నేతలు

గత రెండు, మూడేళ్లుగా జిల్లాలో పార్టీని ముందుకు నడిపించే నాయకత్వమే లేకుండా పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేశాడన్న ఆరోపణలతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. అప్పటి నుంచి డీసీసీ పదవిని భర్తీ చేయకుండానే నెట్టుకొస్తున్నారు. ఇదిగో అదిగో అంటూ డీసీసీ నియామకంపై అధిష్ఠానం తీవ్ర జాప్యం చేస్తూ వస్తోంది. డీసీసీ అధ్యక్షుడు లేకుండానే ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను కూడా పూర్తి చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే డీసీసీ అధ్యక్షున్ని నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఇటీవల డీసీసీ నియామకంపైనే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. అయినా అభిప్రాయ సేకరణ చేపట్టకుండానే సమావేశాన్ని ముగించారు. డీసీసీ రేసులో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డితో పాటు తలమడుగు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నరేష్ జాదవ్, ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ సోయం బాపురావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అలాగే



(తరువాయి 2వ పేజీలో...)

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

- అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మైనార్లకు వాహనలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా మైనార్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో దాదాపు 290 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్ మైనార్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి ఆయా పోలీస్ స్టేషన్‌ల నుంచి ద్విచక్ర వాహనాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మైనార్‌లు డ్రైవింగ్ చేసి ప్రమాదలకు కారణం అయితే ఎలాంటి పరిహారం రాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత లైసెన్స్ తీసుకున్న తరువాతనే వారికి వాహనాలు ఇవ్వాలన్నారు. 14 ఏళ్లకే తన కొడుకు వాహనాలు నడపుతున్నాడని ఉప్పొంగిపోవద్దన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇటీవల హోలీలో పదో తరగతి విద్యార్థి ద్విచక్రవాహన యాక్సిడెంట్లో మరణించారని తెలిపారు. అలాంటి పరిస్థితి తల్లిదండ్రులకు రావొద్దని సూచించారు. పిల్లలను బయటకు పంపే సమయంలో వాహనాలు ఇవ్వొద్దన్నారు. జిల్లాలోనే తొలిసారిగా మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో 290 వాహనాలు గర్తించడం జరిగిందన్నారు. మరోసారి వాహనాలు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అదే విధంగా గంజాయి తాగిన, విక్రయించిన, రవాణ చేసిన కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్ఎస్‌ఐలు వెంకటి, మురళీ, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఇచ్చోడలో ఆహార కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్



గుడిహత్నూర్ పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతూ

సిబ్బంది సమయపాలన పాటించాలి : డీఎంహెచ్‌వో

ఇచ్చోడ, మే 3(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో నరేందర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ పిహెచ్‌సీలో విధులు నిర్వహించే సిబ్బంది ఆసుపత్రి పనివేళలు, సమయపాలనా పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో తాగునీరు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా గుర్తించబడిన క్షయ వ్యాధిగ్రస్తులకు ఆహారకిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మధురిమ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

- గుడిహత్నూర్‌లో పీహెచ్‌సీ తనిఖీ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని వసతుల విషయమై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో ఈ సందరంగా పేర్కొన్నారు. అంతేకాకుండా సిజేరియన్ డెలివరీ వల్ల ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలను గర్భిణులకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు వడదెబ్బ భారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరించాలన్నారు. అలాగే, టీబీ కేసులను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫూడ్ బిస్కెట్లు అందజేశారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్యామ్ సుందర్, ఆయూష్ వైద్యురాలు సాదీయా సబోహి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి సిహెచ్ రాజ్యలక్ష్మీతో కలిసి మాట్లాడారు. ఈనెల 14న జిల్లావ్యాప్తంగా ఆయా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాజీ పడదగ్గ కేసులను జరుగుతుందని, కక్షిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

ఆదిలాబాద్ రూరల్, మే 3(అంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టబోయే సార్వత్రిక సమ్మెలో జిల్లా మున్సిపల్ కార్మికులు పాల్గొనడానికి అనుమతి ఇవ్వాలని శనివారం కమిషనర్ సీవీఎస్ రాజుకు సమ్మె నోటిస్ అందజేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

నేరడిగొండ, మే 3(ఆంధ్రజ్యోతి): పశు పోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శనివారం మండలంలోని ఆరెపల్లి, కోర్టికల్, ధన్నూర్(డి) గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని అన్నారు. ఇందులో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటోకు క్షీరాభిషేకం

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడానికి హర్షిస్తూ శనివారం బోథ్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వం దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మొత్తం 7 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1659 మంది విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే నీట్‌కు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకుకు జరిగే పరీక్షల్లో 1,659 మంది హాజరు కానున్నారు. వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాగా ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షీ షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు కూడా చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోనికి అనుమతించనున్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించనున్నారు. స్ట్రాంగ్ రూం నుంచి ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ తరలించనున్నారు. అయితే ఎండకాల నేపథ్యంలో కేంద్రాల్లో ఫ్యాన్‌లతో తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది కూడా అక్కడే ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా శనివారం సూచించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. ఎండలో ఎక్కువ సేపు ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చని అన్నారు. నీడలో ఉండడం, టోపీ, గొడుగు వంటి వాటిని ఉపయోగించడం మేలన్నారు. మధ్యాహ్న వేళల్లో ఎండ ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువ సేపు ఉండవద్దని, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండడం మంచిదని తెలపారు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించాలని, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకుంటే మేలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి కోసం కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో పేరును తొలగించారంటూ తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన శేర్ల సుశీల శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాబితాలో పేరున్న స్థానిక నాయకులు కుమ్మక్కై తన పేరును తొలగించారంటూ ఆరోపించారు. అన్ని రకాలుగా ఇంటిని నిర్మించుకునేందుకు అర్హత ఉన్నా.. మంజూరు చేయడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా ఈ విషయమై మండల స్థాయి అధికారులను సంప్రదిస్తే అసలు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇచ్చోడ నూతన ఎస్సైగా పురుషోత్తం

ఇచ్చోడ, మే 3(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా పురుషోత్తం శనివారం బాధ్యతలు చేపట్టారు. జైనథ్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన ఇచ్చోడ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇచ్చోడలో విధులు నిర్వహించిన ఎస్సై తిరుపతి ఆదిలాబాద్ ఎస్బీ ఎస్సైగా బదిలీ అయినట్లు ఉత్తర్వులు జారీఅయ్యాయి.

రైతులు అప్రమత్తం కావాలి : వైద్యాధికారి

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): జొన్న పంట రైతులు అప్రమత్తం కావాలని తాంసి పశు వైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. జొన్న పంట కోసిన తరువాత వచ్చే లేపను పెరగకుండా వెంటనే దున్నుకోవాలని, లేదంటే పశువులు లేపను తిని మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్‌లోని బుర్కపల్లి, గోకొండ గ్రామాల్లో జొన్న లేపను తిని పెద్దసంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. వెంటనే రైతులు జొన్న లేప రాకముందే దున్నుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న చైర్మన్ సంద అశోక్

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి : ఉద్యోగ జేఏసీ డిమాండ్

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ సంద అశోక్ అన్నారు. శనివారం టీఎన్జీఓ భవనంలో సమస్యల సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీని ఏర్పాటు చేయగా.. చైర్మన్‌గా అశోకను ఎన్నుకున్నారు. ఇచ్చిన హామీలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమిస్తామన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలలు దాటినా ఉద్యోగుల సమస్యల పరిష్కారం వైపు చూడడం లేదని జేఏసీ చైర్మన్ అశోక్ అన్నారు. 56 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినా పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలతో పాటు జీవో 317 సమస్యలు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ విడుదల చేయాలని, మెడికల్స్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీగా ఏర్పాటు చేసుకున్నామని దశవారీగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నవీన్, శివకుమార్, సుదర్శన్, కొమ్ము కృష్ణ, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మండిపోతున్న ఎండలు

- అత్యధికంగా తలమడుగులో 42.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు ఆదిలాబాద్ జిల్లాలో తీవ్రమైన పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు మండిపోతున్న ఎండలతో జనం బెంబెలెత్తి పోతున్నారు. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.8 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 29.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యధికంగా తలమడుగు మండలంలో 42.7, సిరికొండలో 42.5, గుడిహత్నూర్‌లో 42.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 42.1, తాంసిలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జైనథ్ మండలం మినహా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. పగలంతా భానుడి భగభగలు రాత్రంతా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. క్షణం కరెంట్ పోయినా.. భరించలేని ఉక్కపోత కనిపిస్తుంది. అర్ధరాత్రి వరకు వడగాలుల ప్రభావం కనిపిస్తుంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలకు కూలర్లు, ఏసీలు కూడా పని చే యడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎండల ప్రభావంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులను ముగించుకుని మధ్యాహ్న రైతులు ఇంటికే పరిమితమవుతున్నారు.



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న అశోక్‌రోడ్డు



అంబేద్కర్ చౌక్ రోడ్డు ఇలా..

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ఉట్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యంను గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండలంలోని బీర్సాయిపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికార అధికారులతో పాటు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కలిగించేలా కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాథోడ్ రవీందర్, ఏపీడీ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

శని దేవుడికి ప్రత్యేక పూజలు

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం శని దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది నవధాన్యాలతో పాటు నువ్వుల నూనెను సమర్పించారు. కొందరు నల్ల వస్త్రాలను ధరించి శని దేవునికి పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఉన్న శని దేవునికి పూజలు చేసేందు కోసం జనం బారులు తీరారు. తాంసి మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయం జనంతో కిక్కిరిసిపోయింది. అలాగే పొన్నారి, కప్పర్ల, బండ నాగపూర్, హసనాపూర్, గ్రామాలలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అదేవిధంగా శని దేవుని పూజకు వచ్చే భక్తులకు ఎండ తాకిడి లేకుండా ఉండేందు కోసం ఆయా గ్రామాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. మొత్తం మీద శని దేవుని అమావాస్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పెళ్లయిన వారం రోజులకే.. ప్రియుడితో కలిసి ఆత్మహత్యాయత్నం..!!

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన వారం రోజులకే.. ఓ వివాహిత తన పాత ప్రియుడితో కలిసి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలానికి చెందిన రాజ్‌కుమార్, ప్రవల్లిక గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల అమ్మాయికి కుటుంబీకులు వివాహం చేశారు. అయితే పెళ్లయిన వారం రోజులకే ప్రియుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆ వివాహిత ఆదిలాబాద్‌కు వచ్చి సీసీఐ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కాగా గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వన్ టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

ఇద్దరు అరెస్ట్, ఒకరి పరార్ : డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం ఓ కేటరింగ్ వాహన వ్యక్తులను బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ క్యాటరింగ్ వాహనాన్ని ఆపి సుధీర్, మోసిన్, జావిద్ వాహనానికి సరైన పత్రాలు లేవంటూ బెదిరించారు. రూ.20 వేలు తీసుకున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వారిలో మోసిన్, జావిద్‌ను అరెస్ట్ చేయగా, సుధీర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు.

పోలీస్ విధులకు ఆటంకం : సీఐ

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో విధులలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్సైకు ఆటంకపరచిన వ్యక్తి గటిక ముఖేష్‌ను అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి రవీంద్ర నగర్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్సైతో వాగ్వాదానికి దిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విధులు నిర్వర్తించకుండా ఆటంకపరిచిన కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇతనిపై వన్ టౌన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



మాంగూర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



జడ్పీ మీటింగ్ హాల్‌లో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తూ..

గిరిజన రైతుల భూ సమస్యలను పరిష్కరించాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, మే 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఏజెన్సీ గిరిజన రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జైనథ్ ఉమ్మడి మండలంలోని మాంగూర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాత్నాల మండలంలోని సుందరగిరి మాంగూర్ల గ్రామాలలో గల రైతుల భూములకు పట్టలేక చనిపోతే వారికి ఆర్థిక సహాయం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంలో గిరిజనరైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్‌కుమార్, సాత్నాల తహశీల్దార్ మడావి విశ్వనాథ్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆస్తక్ సుభాష్, సాత్నాల, మాంగూర్ల, సుందరగిరి గ్రామాల రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: పేదింటి ఆడ పిల్లల పెళ్లి చేయలంటే తల్లిదండ్రులు పడే కష్టం తనకు తెలుసని, ప్రభుత్వం నుంచి వచ్చే సాయం కూడా త్వరగా అందిస్తే భారం తగ్గుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో భోరజ్, బేల, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన ఈ సందర్భంగా అందించారు. ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. ఆడ పిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు సంతోషంగా ఉన్న పేద వారిలో ఆర్థిక సమస్య ఎక్కువగా పీడిస్తుందన్నారు. అలాంటి పేదింటి ఆడ బిడ్డ పెళ్లి కోసం ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దీంతో వారికి కొంత అప్పుల బాధతగ్గుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయంపై నమ్మంతో వడ్డీకి తీసుకువస్తున్నారన్నారు. సాయం కూడా సంవత్సరం, ఆరు నెలలకు రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. త్వరగా సాయం అందేల చూడాలని అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్ రెడ్డి, భోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి, తదితరురులు పాల్గొన్నారు.

పశు పోషణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పశు పోషణ పట్ల జాగ్రత్తగా ఉండాలని పశు వైద్యాధికారి డాక్టర్ సుశీల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కౌట(బి) గ్రామంలో పశువులకు ముందస్తు వ్యాధి నివారణ టీకాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల వివిధ రకాల వ్యాధులు సోకుతాయని, అయితే రైతులు ముందస్తు టీకాలను తప్పనిసరిగా పశువులకు ఇప్పించాలన్నారు. ఇందులో వీఏ రాజేందర్, రమేష్, బీరయ్య, బాలు, గోకుల్, లచ్చన్నలు పాల్గొన్నారు.

క్షయ రోగులకు సరుకుల పంపిణీ

ఉట్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ రోగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, యాక్ట్ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ మెంబర్ దళిత రత్న కాటం రమేష్, పీహెచ్‌సీ డాక్టర్ సందీప్‌ల ఆధ్వర్యంలో రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి మందులు ప్రతినిత్యం తప్పకుండా వాడితే తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. వైద్య సిబ్బంది సూచించిన విధంగా మందులు వాళ్లతో, పథ్యం కూడా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృప, శ్రీరామ్, వసంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి భరోసా

తాంసి, మే 3 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన అనిలి పొచ్చెన్న అనే రైతు ఇటీవల ఆదిలాబాద్‌లోని రైతు బజార్‌లో కూరగాయాలు అమ్ముతూ విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. అయితే, ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా సహాయం అందేవిధంగా చూస్తామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర ఉన్నారు.

ఆదిలాబాద్‌లో పలువురు ఎస్సైల బదిలీలు

● ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, మే3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది మంది ప్రొఫెషనల్ ఎస్సైలు, 11 మంది రెగ్యూలర్ ఎస్సైలను బదిలీ చేస్తూ ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఎ. తిరుపతి ఇచ్చోడ పోలీసు స్టేషన్ నుంచి డిస్ట్రిక్ స్పెషల్ బ్రాంచ్ అటాచ్ టు ఆదిలాబాద్ టూ టౌన్, వి.పురుషోత్తం జైనథ్ పోలీసు స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీసు స్టేషన్, పి.దివ్యభారతి బేల పోలీసు స్టేషన్ నుంచి తాంసి పోలీసు స్టేషన్, కె.నాగనాథ్ వీఆర్ ఆదిలాబాద్-బేల, డి.రాధిక తాంసి నుంచి తలమడుగు, పి.గౌతమ్ గుడిహత్నూర్ నుంచి జైనథ్ పోలీసు స్టేషన్, బి.అంజమ్మ తలమడుగు నుంచి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్ అటాచ్‌టు ఆదిలాబాద్ వన్‌టౌన్, డి.శివరాం, సిరికొండ పోలీసు స్టేషన్ నుంచి ఆదిలాబాద్ టు టౌన్ పోలీసు స్టేషన్ అటాచ్, జి.అప్పారావు ఆదిలాబాద్ హెడ్ క్వాటర్స్ నుంచి ఉట్నూర్ పోలీసు స్టేషన్ అటాచ్, డి.పద్మ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీసు స్టేషన్ అటాచ్, కె.రవీందర్ ఆదిలాబాద్ టూ టౌన్ నుంచి మావల పోలీసు స్టేషన్ అటాచ్ బదిలీ అయిన వారిలో ఉన్నారు. నెల పాటు ఎస్‌హెచ్‌ఓలుగా కొమ్ము అఖిల్ నార్నూర్ పోలీసు స్టేషన్, గడ్డం రమ్య జైనథ్ పోలీసు స్టేషన్, బొడపీర్‌సింగ్‌నాయక్ భీంపూర్ పోలీసు స్టేషన్, ఎస్ శ్రీసాయి సిరికొండ పోలీసు స్టేషన్, పిల్లి ప్రణయ్‌కుమార్ మావల పోలీసు స్టేషన్, సతలపల్లి పూజ ఉట్నూర్ పోలీసు స్టేషన్, గడ్డల సంజయ్‌కుమార్ ఇచ్చోడ పోలీసు స్టేషన్, కోట రాజశేఖర్‌రెడ్డి బజార్‌హత్నూర్, ఎస్ జీవన్‌రెడ్డి గాదిగూడ, యనకి మధుకృష్ణ, గుడిహత్నూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

వాహనాల తనిఖీ

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం వాహనాల తనిఖీని పోలీసులు ముమ్మరంగా చేపట్టారు. వాహనాలకు సంబంధించి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పదవులకు పోటాపోటీ!

(1వ పేజీ తరువాయి...)

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీ నిర్ణయమే ఫైనల్

2017 డెడ్‌లైన్‌తో కొంత మంది సీనియర్ నేతలకు భరోసా కనిపిస్తున్నా.. ఎన్నికలకు ముందు అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ లో చేరిన జూనియర్ నేతల్లో మాత్రం హైటెన్షన్ కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. పార్టీలో చేరే సమయంలో అగ్రనేతల హామీతోనే కాంగ్రెస్ కండువా వేసుకున్నట్లు తెలుస్తుంది. అయితే సీనియార్టిని బట్టి పదవులను కేటాయిస్తే సగం కాంగ్రెస్ ఖాళీ అయ్యే అవకాశం ఉందంటున్నారు. అలాగే మెజార్టీ నేతలు అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అన్ని నియోజక వర్గాల్లో సీనియర్, జూనియర్ అనే లొల్లి మొదలయ్యింది. పార్టీలో సీనియర్లకు అసలే ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన నేతలే కీలకంగా కనిపిస్తున్నారు. వీరందరి అభిప్రాయం మేరకే నామినేటెడ్ పదవులను కేటాయించాల్సి ఉంటుంది. ఒకవేళ మొండిగా వ్యవహరిస్తే పార్టీకే నష్టమన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు పార్టీలో విభేదాలు తలెత్తితే అసలుకే మోసం జరిగే అవకాశం ఉందంటున్నారు. మొత్తానికి పార్టీ నిర్ణయమే ఫైనల్ అంటూ కాంగ్రెస్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో? చెప్పలేమని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

ఇంటర్ ప్రవేశాల కోసం లెక్చరర్లు ప్రయత్నించాలి : ప్రిన్సిపాల్

ఉట్నూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం లెక్చరర్లు ప్రయత్నించాలని ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉట్నూర్‌లో ప్రథమ సంవత్సరం జాయిన్ అవ్వడానికి అడ్మిషన్లు ప్రారంభమైనవని అన్నారు. పదవతరగతి పాసైన విద్యార్థులు జూనియర్ కళాశాలలో ప్రవేశాలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడిహత్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(25) హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. మన్నూర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం అధికారులు పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం 63 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో సంబంధిత గ్రామ కార్యదర్శి లావణ్య లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చేపట్టాలని ఆమె సూచించారు. త్వరితగతిన బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దన ఆమె లబ్ధిదారులకు సూచించారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రభుత్వ పరంగా మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి ఇన్‌చార్జి ఆడె గజేందర్ సహాయ సహకారాలతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు.



డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును సన్మానిస్తున్న దృశ్యం

సోన్‌లో నిర్మల్ డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సోన్ గ్రామ ప్రజల తరపున శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును సన్మానించినట్లు సోన్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం సోన్ మండల కేంద్రానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వకుండా పది సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామానికి 100 ఇందిరమ్మ ఇళ్ల సాంక్షన్ చేయడంతో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, అంబేకర్ ప్రసాద్, మొయినుద్దీన్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన పీసీసీ పరిశీలకుడు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు శేఖర్‌గౌడ్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, ఆధ్వర్యంలోని కార్యకర్తల చొరవ, రానున్న కార్యాచరణపై సమీక్ష జరిపినట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులు, రాజకీయ దిశలో మార్పులు, ప్రజాభిప్రాయంపై కూడా ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని శాలువాతో సన్మానిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో పట్టణంకు చెందిన భూపాల్‌రెడ్డి లక్ష్మీల కూతురు నైనారెడ్డిని శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉత్తమమైన మార్కులు సాధించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

పరామర్శ

కుబీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ వత్సలబాయి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ముథోల్ బీఆర్ఎస్ నియోజక వర్గ సమన్వయ సభ్యులు డాక్టర్ కిరణ్‌కొమ్రెవార్ శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదే విధంగా నిగ్వా గ్రామంలో ఇటీవల మృతి చెందిన సుశీలబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

● నిర్మల్ జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నిర్మల్ జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం అన్నారు. పట్టణంలోని సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో, డీఈఎం, ఆర్‌టీ, ఏడీఈ, ఏఈ, సబ్ ఇంజనీర్స్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

6న ముథోల్ నియోజక వర్గ

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

భైంసా, మే 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఈ నెల 6న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కమల జిన్నింగ్ ఫ్యాక్టరీ ఎదుటగల శ్రీ బాంకెట్‌హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని ప్రకటనలో తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, డైరెక్టర్లతో పాటు పార్టీ అన్ని విభాగాల కార్యవర్గ ప్రతినిధులు, శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు విధిగా సమావేశానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశువుల పాక దగ్ధం

కుబీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నయాబాది కాలనీలో పోగుల పోతన్న అనే రైతుకు సంబంధించిన పశువుల పాక శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం పశువుల పాక వెనక చెత్తకు ఎవరో కాలనీ వాసులు నిప్పంటించగా అది కాలుతూ కాలుతూ మంటలు చెలరేగి పశువుల పాకకు అంటుకుంది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. రైతుకు సంబంధించిన వ్యవసాయ సామాగ్రి, డ్రిప్ పైపులు తదితర వస్తువులు కాలిపోయాయని సుమారు రూ. 50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అగ్ని మాప సిబ్బంది, ఫైర్ ఆఫీసర్ ఎం. రవి, సిబ్బంది ఏ రాజజేందర్, విలాస్, కరణ్‌సింగ్, హర్శిన్ ఉన్నారు.



దగ్ధమైన పశువుల పాక సామగ్రి

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పద్మాకర్, మూరాపూర్ పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రాజారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీఎం బోసు, సీసీ రేఖ, ఇతర లీడర్స్, గ్రామ సెక్రటరీ వినోద్‌కుమార్, వీడీసీ సభ్యులు, గ్రామంలోని రైతులు, వీవో అధ్యక్షురాలు రబియాబి, వీవో సభ్యులు, వీవోఏ గంగాజల పాల్గొన్నారు.

ముజ్గి గ్రామంలో..

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం ముజ్గి గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు ధర్మాజీ రాజేందర్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, ముజ్గి గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి అందరూ సహకరించండి

● టీఎంయూ రీజనల్ కార్యదర్శి ఆర్. గంగాధర్

నిర్మల్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే ఆర్టీసీ సమ్మె విజయవంతానికి సంస్థలో పని చేస్తున్న కార్మికులందరూ సహకరించి సమ్మె విజయవంతానికి కృషి చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియర్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజనల్ కార్యదర్శి ఆర్. గంగాధర్ ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో యాజమాన్యం మొండివైఖరి, కార్మికులపై అధిక పని భారం, అత్యవసర పరిస్థితుల్లోను సెలవు ఇవ్వకపోవటం, మహాలక్ష్మి పథకం వల్ల చేయని తప్పులకు సైతం అధికారుల వేధింపులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు మేనిఫెస్టోలో హామీలను నెరవేర్చకపోవటం, రెండు వేతన సవరణలు పెండింగ్‌లో పెట్టటం, ముఖ్యంగా కార్మికులపై అధికారుల వేధింపు చర్యలు వంటి వాటికి నిరసగానే సమ్మె చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ

పరీక్షలకు 16లోగా దరఖాస్తు చేసుకోవాలి

● నిర్మల్ జిల్లా విద్యాధికారి పి. రామారావు

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి తప్పిన విద్యార్థులకు జూన్ 3 నుంచి 13 తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులు మే నెల 16 తేదీలోపు పరీక్ష రుసుము చెల్లించాలని జిల్లా విద్యాధికారి పి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రుసుములను ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలన్నారు. రూ. 50 ఆలస్య రుసుముతో సబ్జెక్టు పరీక్ష జరిగే ముందు రెండు రోజుల వరకు చెల్లించవచ్చని, మార్కుల పునఃలెక్కింపుకు ఒక్కో సబ్జెక్టుకు రూ. 500ల చొప్పున బ్యాంకు చలానా తీసి.. ఫారమ్ పూర్తి చేసి దాన్ని మే నెల 15వ తేదీలోపు హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల విభాగానికి పోస్టు ద్వారా నేరుగా పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పునఃపరిశీలన, జవాబు పత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ. 1,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరించి జిల్లా డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో సమర్పించాలని, అందుకు మే 15వ తేదీ తుది గడువు అని ఆయన తెలిపారు.

వేసవి శిబిరాలు ప్రారంభం



మండల కేంద్రంలోని వేసవిశిబిరంలో పాల్గొన్న విద్యార్థుల సాధన

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శనివారం సమ్మర్ క్యాంపును ఎంఈవో ముత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవిసెలవుల్లో ఈ క్యాంపును సద్వినియోగపరుచుకోవాలన్నారు. క్యాంపుకు రావడం వలన విద్యార్థులు వృధాగా తిరగడం జరగదన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే క్యాంపులు మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరులో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు జరిగే విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు లేదా 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇట్టి క్యాంపులో విద్యార్థులకు ఆటల పోటీలు, డ్యాన్సు మ్యూజిక్, డ్రాయింగ్, తదితర వాటిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 25 మంది విద్యార్థులకు ఒక వాలంటీర్‌ను నియమించి ఈ క్యాంపును కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పట్ల అప్రమత్తంగా ఉండాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దిలావర్‌పూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవికాలం దృష్ట్యా నీటిఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులపై ఆరా తీశారు. ఎక్కడ నీటి సమస్య ఉన్న ఎంపీడీవో దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీటి సమస్యను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా


గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదే శాల మేరకు ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు, గ్రామ రెవె న్యూ సదస్సుల్లో భాగంగా జిల్లాలోని బోరజ్ మండలాన్ని పైలెట్ ప్రా జెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి సద స్సులు నిర్వహించే ప్రదేశంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని శని వారం గూగుల్ మీట్ ద్వారా తహసీల్దార్లకు పలు సూచనలు, సలహాలు, దిశా నిర్దేశం చేశారు. జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దర ఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే బోరజ్ మండలాన్ని పైలెట్‌గా తీసుకోవడం జరిగిందని తెలిపారు. బోరజ్ పైలెట్‌లో మూడు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే విధంగా గ్రామానికి వెళ్లే ముందు రోజు గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని, సంబంధిత అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. 28 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల, రెవెన్యూ సదస్సుల ప్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరకాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. పట్టాలు ఉండి పోజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించాలన్నారు. హైకోర్టు అనుమతులు రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యచరణను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల చివరికల్లా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారంచూపాలన్నారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్‌డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్లు, ఏడీ సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై ఇంటలిజెన్స్ పోలీసుల ఆరా

బోథ్, మే 3 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల పైన ప్రత్యేక పోలీసు యస్‌బి ఇంటలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగానే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇంటలిజెన్స్ ఎస్బీ పోలీసులు వడ్డీ వ్యాపారుల వివరాలు సేకరి స్తున్నట్లు సమాచారం.

● వ్యాపారులు ఎక్కువ.. కేసులు తక్కువ

మండలంలో వడ్డీ వ్యాపారాలు నిర్వహించి వారు అధిక మొత్తంలో ఉన్న కేవలం దినసరి వడ్డీ వ్యాపారం ఫైనాన్స్ వ్యాపారం చేసే వారిపైన అధికారులు కేసులు నమోదు చేసి ఊరుకున్నారన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో మిగతా పెద్ద మొత్తంలో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి పైన కేసులు నమోదు చేయాలని పోలీసులు నిర్ణయించి నట్లు సమాచారం. దీంతో అధిక మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్న వారి జాబితాను సిద్ధం చేసి జిల్లా ఎస్పీకి అందించడం తెలిసింది.

● చిట్టీ వ్యాపారులపై నిఘా

ఇలాంటి అనుమతులు లేకుండా చిట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వారిపైన పోలీస్ అధికారులు నిఘ వేసినట్లు తెలిసింది. అయితే మండలంలో లక్షలాది రూపాయల చిట్టి వ్యాపారాలు కొనసాగుతున్నట్లు అధికారులు ఇప్పటికే సమాచారాన్ని సేకరించడం జరిగింది. కమిషన్ పైన నిర్వహించే ఈ చిట్టి వ్యాపారం రోజురోజుకు విస్తరిస్తుండడంతో అధికారులు ఈ వ్యాపారం పై దృష్టి సారించినట్లు తెలిసింది. అంతేగాక గతంలో జిల్లాలో చిట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఎంతోమంది పరారీ కావడంతో మును ముందు ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలన్న దృక్పథంతో చిట్టి వ్యాపారంపై కన్నేసినట్లు తెలిసింది. పట్టణాల నుంచి పల్లెల వరకు విస్తరిస్తున్న ఈ వ్యాపారం పై పోలీసులు కొరడా ఝులిపించినట్లు తెలిసింది.

● వడ్డీ వ్యాపారం భాగస్వాములపై నిఘా

ఫైనాన్స్ వ్యాపారాలను చిట్టి వడ్డీ వ్యాపారాలను నిర్వహిస్తున్న వారి జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా అనే విషయాన్ని అధికారులు నిర్ధారణ చేస్తున్నారు. ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులు చిట్టి వడ్డీ వ్యాపారాలు చేస్తుండడంతో ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడం వల్ల ఈ వ్యాపారాన్ని కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. మొదట రోజు వారీ ఫైనాన్సు వడ్డీపై దృష్టి పెట్టి కట్టడి చేస్తున్న అధికారులు ఈసారి వడ్డీ చక్రవడ్డీ వ్యాపారులపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఇండ్లు, భూములు బంగారం వాటిని తనకా పెట్టుకుని బాండ్ పేపర్ల పైన వ్యాపారాలు నిర్వహించే వారి పైన ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అయితే ధర్మ వడ్డీ అంటే రెండు శాతం వడ్డీతో అప్పులు ఇచ్చిన వారిపట్ల కఠినంగా వ్యవహరించవద్దని మూడు నాలుగు శాతం పైన చక్రవడ్డీ వ్యాపారం పైన కఠినంగా వ్యవహరించాలని పోలీసులు చర్యలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

కృత్రిమ మేధస్సు తరగతుల ప్రారంభం


ఉట్నూర్‌లో ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉట్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏఐ (కృత్రిమ మేధస్సు) తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, మండల విద్యాధికారి రాపెల్లి ఆశన్న, సీఆర్‌పీ ప్రవీణ్, ధరంసింగ్‌లు పాల్గొన్నారు.


వివిధ చిత్రాలు వేసిన సాయి కుమార్

వృత్తి టీచర్.. ప్రవృత్తి చిత్రలేఖనం

● చేతి వేలుతో సెల్ ఫోన్‌పై బొమ్మలు గీయడంలోనూ దిట్ట ● చిత్రలేఖనంలో ఘనుడు..సాయికుమార్

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆలోచనలకు మెరుగులద్ది చిత్రాలుగా మలుస్తాడు. ప్రకృతిని కుంచెతో ఒడిసిపడుతాడు. బొమ్మలకు ప్రాణం పోస్తాడు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన సాధుల సాయి కుమార్ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి చిత్రలేఖనంలో ఘనుడు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. సాయి కుమార్ ఐదవ తరగతిలోనే చిత్రకళపై ఆకర్షితులయ్యారు. అతని అన్నయ్య ఉదయ్, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బసవ రాజుల ప్రోత్సాహంతో చిత్రకళలో ప్రావీణ్యం సాధిస్తున్నాడు. మండలంలోని బోరిగాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ మరోపక్క చిత్రలేఖనం గీస్తూ ఎందరికో చిత్రలేఖనం నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

చిత్రాలకు జీవం...

సాయి కుమార్ ప్రతీ బొమ్మకు ప్రాణం పోస్తాడు. సమాజానికి ఉపయోగ పడే ఎన్నో సందేశాత్మక చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలు వారాయి. మారు తున్న కాలమాన పరిస్థితులలో ప్రకృతికి వాటిల్లుతున్న నష్టాలను చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తున్నాడు. పెన్సిల్ వర్క్, వాటర్ కలర్, పెయింటింగ్‌లలో దిట్ట. మనుషుల చిత్రాలు క్షణాల్లో గీస్తాడు. సుద్ద ముక్క పైన, గిడాల పైన, కాగితాల పైన దేశ నాయకుల చిత్రాలను, బడి పిల్లలు హరితహారంకు సంబంధించిన చిత్రాలు, దేవుడి బొమ్మలు, గ్రామీణ అందాలు, ప్రకృతి ఒడి, బాల కార్మికుల జీవనం, ఆహ్లాదం కలిగించే రమణీయ దృశ్యాలు, పుష్పాలు, చెట్లు, వాయిద్యాలు వేసిన తదితర చిత్రాల్లో జీవం ఉట్టి పడుతుంది. నిలబడ్డ చోటే వ్యక్తులకు చిత్ర రూపం ఇవ్వడంలో మేటి. అలాగే చేతి వేలుతో సెల్ ఫోన్ తెరపై బొమ్మలు గీయడంలో దిట్ట.


సుద్దముక్కపై చిత్రాని చెక్కుతున్న దృశ్యం





వచ్చిన కళ ఇతరులకు నేర్పాలన్నదే నా లక్ష్యం

● సాధుల సాయి కుమార్, ప్రభుత్వ టీచర్



నేను నేర్చుకున్న కళను ఇతరులకు నేరాలన్నదే నా లక్ష్యం. మా గ్రామంలో నేను విధులు నిర్వహిస్తున్న చోట ఆసక్తి గలవారికి బొమ్మలు వేయడం, వేయించడం నా లక్ష్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మంచి కోసం నా చిత్ర లేఖనం కొనసాగుతూనే ఉంటుంది.

చెక్ డ్యామ్ పూర్తయితే పంట వేసేందుకు వెళ్లేదెలా..!?

● వంతెన నిర్మించి వసతి కల్పించండి

బోథ్, మే 3 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపు కోసం మండలంలోని పెద్ద వాగుపైన రాష్ట్ర ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. అయితే ఇప్పటికీ నాలుగు చెక్కగా మరో చెక్ డ్యామ్ పొచ్చెర వాగుపై నిర్మాణం చేపట్టారు. దాదాపు ఐదు కోట్ల రూపాయలతో మంజూరైన చెక్ డ్యామ్ నిర్మాణం ప్రారంభమైంది. అయితే చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల రైతులకు మేలు జరుగుతున్న జగ్గంపై భాగంలో ఉన్న దాదాపు 100 మంది రైతులకు రోడ్డు వసతి లేకుండా పోతుందని వాపోతున్నారు. అయితే చెక్ డ్యామ్ నిర్మాణంపై భాగంలో గతంలో ఒక చెక్ డ్యామ్ నిర్మించాలని డిమాండ్ చేయగా అధికారులు నిర్మిస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. అయితే చెక్ డ్యామ్‌పై భాగంలో బ్రిడ్జి నిర్మించి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


పొచ్చెర వాగుపై నిర్మాణంతో ఉన్న చెక్ డ్యామ్

● పంట నష్టపోయే ప్రమాదం ఉంది



అధికారుల నిర్ణయం మంచిదే అయినా చెక్ డ్యామ్‌పై భాగంలో వర్షా కాలం నీరు నిలవడంతో తమ చేలకు వెళ్లే అవకాశం కోల్పోవాల్సి వస్తుందని రైతు చిలుకూరి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. తాము గతంలో నిర్మించిన చెక్ డ్యామ్ వల్ల పై భాగంలో చేలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గుర వుతున్నారు. అయితే ప్రభుత్వం మరోచెక్ డ్యామ్ నిర్మానం చేపట్టడం వల్ల ఈ ఏడాది తమ చేనలలోకి దారి లేకి బ్బంది పడాల్సి వస్తుందన్నారు. దాదాపు తమ గ్రామానికి చెందిన మూడు వందల ఎకరాల భూమి ఎలా సాగు చేయాలో అర్థం కాక రైతులు ఆందోళన చేస్తున్నారు.

\- చిలుకూరి రమేష్‌రెడ్డి రైతు

● నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలి



ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి కాకముందే ప్రభుత్వం చెక్ డ్యామ్ అవతల ఉన్న రైతులకు ముందుగా వంతెన నిర్మించి ఇ వ్వాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు.

\- కొట్టాల గంగారెడ్డి, రైతు

ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులు ఎప్పుడో..!?

● గిరిజనుల ఆవేదన


గిరిజన గ్రామం పిట్ల గూడెం


పిట్లగూడెం వంతెనపై తాత్కాలికంగా మొరం పోసిన దృశ్యం

ఉట్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా కురుస్తున్న వరాకాలం వర్షాలకు కొట్టుకు పోతున్న వంతెనకు శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేస్తారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని టక్కుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పిట్లగూడెం గ్రామంలో 70 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయి. ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుమురంభీం ప్రాంగణం మీదుగా దేవానగర్ నుంచి పిట్లగూడెం రోడ్డుపై వాగుపై ఉన్న వంతెన ప్రతీ వర్షాకాలం కొట్టుకు పోతుంది. వర్షాకాలం వచ్చిందంటే పిట్లగూడెం గ్రామ గిరిజనులు కాలిబాటన పెరక గూడెం చేరుకొని ఉట్నూర్, ఆదిలాబాద్ వైపు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఉట్నూర్ నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిట్లగూడెం కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్థులు చుట్టూరా 5కిలోమీటర్లు తిరిగి ఉట్నూర్ వెళ్లాల్సి వస్తుంది. ఏ చిన్న పని కోసం అయినా వైద్యం కోసం అయినా ఇబ్బంది పడాల్సి వస్తున్నదని గిరిజనులు తెలిపారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు నిర్మాణంలో నాణ్యత లోపం ఉండడంతో పాటు ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికలు లేకుండా చేపట్టిన నిర్మాణంతో చిన్నపాటి వర్షాలకు ఈ వంతెన వద్ద ఉన్న వాగు పొంగి ప్రవహించడంతో కల్వర్టు కొట్టుకుపోతుంది. రెండేళ్ల క్రితం కొట్టుకు పోయిన కల్వర్టుకు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయగా గ్రామస్థులే మొరం పోసుకుని దానిపైన తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా కల్వర్టును ఇంజనీరింగ్ అధికారుల ప్రమాణాలతో నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన కమిటీ నియామకం

● చైర్మన్‌గా అంగూరి మహేష్‌కు అవకాశం


కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం

దిలావర్‌పూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధమైన కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన కార్య వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న దేవస్థానం కమిటీ నియామకం ఎట్టకేలకు పూర్తికావడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో పది రోజుల్లో శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్స వాలు ఉండటంతో ఈ నెల 5వ తేదీనే నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్స వానికి దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవస్థానం నూతన కమిటీ ఇదే..

కాల్వ దేవస్థానం నూతన కార్యవర్గంలో 13 మంది సభ్యులకు స్థానం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అంగూరి మహేందర్, గుమ్ముల చిన్న నర్సయ్య, గట్టు కాశీనాథ్, జాదవ్ పుష్ప, వి. శివకుమార్, గడ్డం నర్సారెడ్డి, పూదరి శివ కుమార్, దాసరి శ్రీకాంత్, గైని దేవేందర్, సూర నవీన్ కుమార్, ఆకారపు లక్ష్మణ్, నూతికట్టు సాయన్న, చిన్నోల్ల లక్ష్మారెడ్డిలకు నూతన కమిటీలో స్థానం లభించింది.

చైర్మన్‌గా అంగూరి మహేందర్..

డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావుకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన కాల్వ గ్రామానికి చెందిన అంగూరి మహేందర్ కాల్వ దేవస్థానం నూతన చైర్మన్ అయ్యేందుకు అవకాశముంది. అధికార పార్టీలో చురుకైన కార్యకర్తగా, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మహేందర్ చైర్మన్ కావడం లాంచనమేనన్న ప్రచారం ఉంది. ఈ నెల 5వ తేదీన సోమవారం నూతన పాలకవర్గం కొలువుదీరనుంది.

తాగునీటి కోసం మూగ జీవాల వెతలు


వాగులో నీళ్ల కోసం పరితపిస్తున్న గేదెలు

తాంసి, మే 3 (ఆంధ్రజ్యోతి): జనాలకే కాదు.. మూగజీవాలకు సైతం తాగునీటి ఇబ్బంది తప్పడం లేదు. ఒకపక్క మేత కరువు మరో పక్క నీళ్ళు దొరకక మూగ జీవాలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కావు. తాంసి మండలంలోని ఏ ఒక్క వాగులో సైతం చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. దీంతో మూగ జీవాలకు నీటి కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గ్రామాలలోనే పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటి నీటి సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఫొటో న్యూస్

క్రీడా ప్రాంగణం.. బోర్డుకే పరిమితం

గ్రామీణ ప్రాంతవాసులు వివిధ క్రీడల్లో నైపుణ్యాలు సాధించేందుకు అప్పటి ప్రభుత్వం ఊరురా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి నెలకొల్పిన ఈ అబ్‌స్ట్రాక్ట్ ఎందుకు పనికి రాకుండా పోయాయి. అనేక గ్రామాల్లో ఖాళీస్థలాలు, పాఠశాల మైదానాలతో పాటు కొన్ని చోట్ల డంపింగ్ యార్డులకు కేవలం బోర్డులు తగిలించి బిల్లులు తీసేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా వీటితో గ్రామీణులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


బోథ్ మండలం మందబోగుడ రఘునాథపురం



సిరికొండ మండలం సుంకిడి గ్రామం


బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం



మారుమూల పల్లెలకు కరెంటు కష్టాలు



- శాపమవుతున్న అటవీశాఖ అనుమతులు
- కష్టాల కడలిలో పదమూడు పల్లెలు
- సమస్యగా మారిన అనుమతుల సాధన
- రాష్ట్ర సర్కారు ఒత్తిడి తీసుకువస్తేనే జిల్లాలోని పల్లెలకు విద్యుత్ సౌకర్యం

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

జిల్లాలోని అనేక మారుమూల గిరిజన పల్లెలకు గత 50 సంవత్సరాల నుంచి కరెంటు సౌకర్యం అందడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం వస్తుందని గిరిజనులు ఆశపడ్డారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పల్లెలకు కరెంటు సౌకర్యం అందించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పెంబి, కడెం మండలాల్లోని 16 గ్రామాలు కరెంటు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నాయి. కాగా ఇందులో నుంచి మూడు గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్‌ఫేస్ కరెంటు సౌకర్యం కూడా లేకపోవడంతో ఆ గ్రామాలన్నీ అంధకారంలోనే మగ్గుతున్నాయి. మరో 13 గ్రామాల గిరిజనులు మాత్రం త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కోసం అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో నేతలంతా గ్రామాలకు వెళ్ళి కరెంటు సౌకర్యం కల్పిస్తామంటూ హామీల వర్షం కురిపించడం రివాజుగా మారింది. ఎన్నికల తరువాత ఈ పల్లెల వైపు ఏ ఒక్కనేత కన్నెత్తి చూడడం లేదంటున్నారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే చాలాసార్లు మూడు గ్రామాలకు సింగిల్ ఫేజ్ కరెంటు, మరో 13 గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.



కరెంటు సౌకర్యానికి నోచుకోని మారుమూల గిరిజన పల్లె

దీనికి సంబంధించి అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించే విషయంలో వెనకడుగు వేయాల్సి వస్తోంది. అప్పటి ప్రభుత్వం అటవీశాఖ ద్వారా అనుమతులు సాధించడంలో పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలున్నాయి. గ్రామాలన్నీ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున ఇక్కడ అటవీశాఖ అనుమతులు సాధించడం కష్టతరంగా మారింది.

కరెంటు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు

కరెంటు కోసం 16 గ్రామాలు ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాయి. ఇందులో నుంచి మూడు గ్రామాలు అసలు కరెంటు సౌకర్యానికి నోచుకోక తల్లడిల్లుతుండగా మరో 13 గ్రామాలు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. పెంబి మండలంలోని పోచంపెల్లి (సోముగూడ), పెదరాగిదుబ్బ, గోదుమల గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్‌ఫేజ్ కరెంటు సౌకర్యం కూడా లేదు. అలాగే ఇదే మండలంలోని జీడిమల్లి తాండ, గోరి పెద్దయ్య గూడెం, కోరకంటి, ఉసాగుట్ట, రాగిగూడ, జంగుగూడ, సాకిగూడ, రామాగూడ, కొత్తగూడ, ఇస్లాంపూర్, కడెం మండలంలోని గండి గోపాల్‌పూర్, ఇస్లాంపూర్, మీది చింత గ్రామాలు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆటంకమవుతున్న అటవీశాఖ అనుమతులు

పెంబి, కడెం మండలంలోని 16 గిరిజన గ్రామాలు కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి వస్తుండడంతో ఆ గ్రామాలకు కరెంటు సౌకర్యం అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. అయితే తమకు ఎక్కడైనా ఓ చోట 23 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే ప్రత్యామ్నాయంగా తాము అనుమతులు జారీ చేస్తామంటూ గతంలో అటవీశాఖ షరతులు విధించింది. ఈ షరతులపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు అప్పటి కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుపోగా భైంసా ప్రాంతంలో అటవీశాఖకు 23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కాగా నిబంధనలు మారాయని అంటూ మరోసారి అటవీశాఖ కొత్త మెలిక పెట్టింది. కొత్తచట్టం ప్రకారం తమకు కేటాయించిన 23 ఎకరాలకు తోడుగా మరో 23 ఎకరాలు ఇస్తేనే అనుమతులు జారీ చేస్తామంటూ స్పష్టం చేసింది. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లయ్యింది. అటవీశాఖ కోరుకున్న విధంగా అదనంగా 23 ఎకరాల స్థలం సేకరించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. అటు అటవీశాఖ, విద్యుత్‌శాఖ ఇటు రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో అదనపు స్థలం కేటాయింపు వ్యవహారమే కాకుండా విద్యుత్ సౌకర్యం అందించే విషయమై ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి.

కాంగ్రెస్ సర్కారు కరుణించాలంటూ వేడుకోలు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తున్న కాంగ్రెస్ సర్కారు తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటూ కడెం, పెంబి మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అటవీ శాఖ అనుమతులు ఎలాగైనా సాధించాలని వారంతా వేడుకుంటున్నారు. అటవీ శాఖ కోరుతున్న విధంగా ఎక్కడైనా అదనంగా స్థలం కేటాయించాలని ఆ గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు. తామంతా యేళ్ళ నుంచి కరెంటు సౌకర్యం కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికి అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ గోడును పరిష్కరించాలని పెంబి, కడెం, మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

మా గోడును పట్టించుకోండి : జైతు, కొసగుట్ట, పెంబి మండలం

చాలా ఏళ్ల నుంచి కరెంటు కోసం అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం. ఇప్పటి వరకు ఏ ఒక్కరూ తమ గోడును పట్టించుకోలేదు. తమ తల్లిదండ్రులు, తాము, తమ పిల్లలంతా చీకట్లోనే గడుపుతున్నాం. కాంగ్రెస్ తమ గోడును పట్టించుకోవాలి. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు స్పందించి కరెంటు సౌకర్యం కల్పించేందుకు సర్కారు ద్వారా కృషి చేయాలి.

వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతపేట్ గ్రామంలో గల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



విట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. విట్టాపూర్ గ్రామం పైలట్ గ్రామంగా ఎన్నికైనందున ఈ గ్రామానికి ప్రభుత్వం 55 ఇండ్లు మంజూరు చేసింది. అందులో 23 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం పనులు చేపడుతున్నారు. వారు కూడా నిర్మాణం పనులను వేగవంతం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మిగితా వారు కూడా ఇండ్ల నిర్మాణం పనులు సత్వరమే ప్రారంభించేలా చూడాలని లేని పక్షంలో వారి పేర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణంలో అలసత్వం లేకుండా అధికారులు బాధ్యతతో వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు నిర్మాణం పనులు పరిశీలించాలన్నారు. ఈయన వెంట హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి సారిక, గ్రామస్తులు లబ్దిదారులు ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేస్తా'



కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారతీయ జనతాపార్టీ బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు పసుల నవీన్ అన్నారు. శనివారం కుంటాల మండలంలోని అంబకంటి గ్రామంలో ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు వెంగల్‌రావు, మాజీ ఎంపీటీసీ, పలువురు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతాపార్టీ వైపు యువత మొగ్గు చూపుతున్నారని కావున రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

మహిళల ఆత్మ రక్షణకు కరాటే అవసరం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిత రామకృష్ణ

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆత్మ రక్షణకు కరాటే అవసరమని డాక్టర్ అనిత రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వివేక్ హైస్కూల్‌లో శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత రామకృష్ణ మాట్లాడుతూ... బాలికలకు మానసిక, శారీరక దృఢత్వానికి జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుటకు భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలనైనా ఎదుర్కొని గమ్యం చేరుకొనుటకు, ఆత్మవిశ్వాసం, మనోనిబ్బరం కలిగి ఉన్నత శిఖరాలను చేరుకొనుటకు ఇలాంటి కరాటే శిక్షణ చాలా అవసరమని చక్కని నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ నూకల విజయ్‌కుమార్, జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తేజిందర్ సింగ్ బాటియా, వివేక్ హైస్కూల్ కరస్పాండెంట్ గంద్రత్ రమేష్, అనురాధ పంపట్ వార్, మంచిర్యాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, సోలాపూర్ రాజేశ్వర్, మధుకర్ పంపట్ వార్, గన్నేరి ప్రభు, ఓటరికారి విద్యాసాగర్ కరాటే మాస్టర్, కిన్నెర్ల మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది

- బాసర ఐఎఫ్ఎస్ అధికారి శరవనన్



విధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని బాసర ఐఎఫ్ఎస్ అధికారి శరవనన్ అన్నారు. శనివారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల అర్బన్‌పార్క్‌లో విధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖలో పని చేస్తున్నట్లు వంటి ప్రొటెక్షన్ వాచర్లకు బ్యాగ్, యూనిఫామ్ షూస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అటవీప్రాంతంలో వణ్యప్రాణుల దాహార్తిని తీర్చడం కోసం రూ.50వేలతో 50నీటి గుంతలను తవ్వించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నాగిని బాను విధి ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ ధీరజ్ కావేరి, డాక్టర్ విజయ కావేరి, టాస్క్‌ఫోర్స్ అధికారి వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో, రాథోడ్ అవినాష్, ఎఫ్ఆవో ఎండీ నజీర్‌ఖాన్, ఉప అటవీక్షేత్రాధికారి, వేణుగోపాల్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

మాదాపూర్‌లో కూరగాయల మార్కెట్ ప్రారంభం



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ... మాదాపూర్ గ్రామంలో ప్రతి శనివారం కూరగాయలతో పాటు మార్కెట్‌లో అన్ని రకాల దుకాణాలు అందుబాటులోకి ఉంటాయ న్నారు. ప్రతి శనివారం జరిగే మార్కెట్‌ను మాదాపూర్ గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసులు వ్యాయామం చేయాలి : ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ సాయుధదళ ముఖ్య కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వీక్లీపరేడ్ అనేది సిబ్బందికి క్రమశిక్షణ, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయంలో దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యమని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్‌ను అనున్యితం కాపాడుకోవాలన్నారు. ఈ పరేడ్‌లో ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, ఆర్ఐలు రాంనిరంజన్‌రావు, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

ఏకకాలంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు



పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ



తల్వేద వద్ద ధ్రువపత్రాలు లేని వాహనాలతో పోలీసులు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏకకాలంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పోలీస్ సిబ్బంది, జిల్లా ఏఆర్ సిబ్బందితో శనివారం సాయంత్రం ఒకేసారి నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సరైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకోవటం జరిగిందని తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లలో అసాంఘిక కార్యకాలాపాలను అరికట్టడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని, రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని వాహనాల వల్ల జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహాయం అందదని తెలిపారు.

ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో వాహనాల తనిఖీలు, అన్ని లాడ్జ్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రనే రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఒకేసారి నాకాబంది నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో అవినాష్ కుమార్ ఐపీఎస్, రాజేష్ మీనా ఐపీఎస్, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరి మృతి



బసవరాజు (ఫైల్)

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఎస్.బసవరాజు చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే బసవరాజు శుక్రవారం సాయంత్రం 04:30 గంటలకు చేపల వల తీసుకొని చేపట్టలు పట్టడానికి ఎస్సారెస్పీ డ్యాంలోకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతని గురించి కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం ఉదయం 8 గంటలకు ఎస్సారెస్పీ డ్యాంలో కాళ్లకు చేపల వల చుట్టుకొని బసవరాజు మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉంటాడని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. మృతుడికి ముగ్గురు కొడుకులు ఒక కూతురు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

తానూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్‌కు తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త శ్రావణ్ తండ్రి ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదే విధంగా మండలంలోని దాగం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో నీలాబాయి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించి మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ జెడ్పీవైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మచైర్మన్ పోతారెడ్డి, కోలూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

భూ భారతి పైలట్ ప్రాజెక్టుకు

కుంటాల మండలం ఎంపిక

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ భారతి పైలట్ మండలంగా కుంటాల మండలం ఎంపికైనట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. ఈ పథకానికి మండలం ఎంపికైనందున ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులకు ముగ్గురు తహసీల్దార్‌లు టీంగా ఏర్పడి ప్రతిరోజు రెండు, మూడు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ప్రజలకు సంబంధించిన ఏవైనా భూ సమస్యలు, పట్టా పాసుబుక్ సమస్యలు ఏవైనా ఉంటే అక్కడికక్కడే అధికారులు అర్జీలు స్వీకరిస్తారని ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోపరుచుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండలంలోని రాయపాడ్, మెదన్‌పూర్, ఓలా గ్రామాల్లో 5వ తేదిన, సూర్యాపూర్, అంబకంటి, లింబా (బీ) గ్రామాల్లో 6వ తేదీన రాజాపూర్, కుంటాల, వెంకూర్‌లలో 7వ తేదిన, లింబా (కే), కల్లూర్, విట్టాపూర్‌లో 8వ తేదిన, దౌనెల్లి, అందకూర్, పెంచికల్‌పాడ్‌లో 9వ తేదిన, అంబుగాంలో 12వ తేదీన ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నిప్పుల కొలిమి

- శనివారం జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఆరు మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ
- నర్సాపూర్(జి)లో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

ఖానాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మరోసారి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా ఎండ దంచికొడుతోంది. శనివారం జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో అధికారులు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు. నర్సాపూర్(జి), భైంసా, దస్తురాబాద్, కుభీర్, కుంటాల, తానూర్ మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నర్సాపూర్(జి) మండలంలో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, సోన్ మండలంలో అత్యల్పంగా 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. మే నెల ఆరంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో రాబోయే నెల రోజులు పరిస్థితి ఎలా ఉండబోతుందోనని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 దాటిన తర్వాత సాయంత్రం నాలుగు గంటల లోపు అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి



గంగాసింగ్ (ఫైల్)

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మహాలక్ష్మి గల్లీకి చెందిన ఠాకూర్ గంగాసింగ్(70) అనే వృద్ధుడు వడదెబ్బతో శుక్రవారం రాత్రి చనిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మృతుడు గంగాసింగ్ శుక్రవారం తన వ్యవసాయ చేనులో ఎరువు కుప్పలు చిమ్మేందుకు వెళ్లాడు. అయితే తీవ్రమైన ఎండల కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లి ఇంటికి తీసుకెళ్లారు. అంతలోనే మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మెరుగైన చికిత్స కోసం భైంసాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తానూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జౌల(బి) గ్రామానికి చెందిన సాటప్ప పటేల్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో శనివారం మృతి చెందినట్లు రైతులు తెలిపారు. రైతు యొక్క వివరాల ప్రకారం. . రైతు చేన్లో గాలితో విద్యుత్ తీగలకు షార్ట్ షర్క్యూట్ కావడంతో విద్యుత్ తీగలు తెగి పడి ఆవుపై పడడంతో అక్కడిక్కడే ఆవు మృతి చెందింది. రైతు విద్యుత్‌షాక్ ఏఈ ప్రదీప్‌కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పశువైద్యాధికారి డా. రాజేశ్‌కు తెలుపగా అతను ఘటన స్థలానికి వచ్చి పంచనామ నిర్వహించాడు. ఆవు విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని శనివారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. తద్వారా త్వరితగతిన కుల గణన పూర్తి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.





కాంగ్రెస్ పదవులకు.. పోటాపోటీ!

- 2017కు ముందు పార్టీలో పని చేసిన వారికే పదవులు వచ్చే అవకాశం
- పార్టీ అధిష్ఠానం పెద్దలు నిర్ణయించినట్లు జోరుగా ప్రచారం
- సీనియార్టీ ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల భర్తీకి అవకాశం
- డీసీసీ పీఠంపై భారీ ఆశలు పెట్టుకున్న పలువురు నేతలు
- సీనియర్లకు భరోసా, జూనియర్ నేతల్లో మొదలైన హైటెన్షన్
- జిల్లా పార్టీ పరిస్థితులపై ఆరా తీస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం నేతల మధ్య పోటాపోటీ కనిపిస్తోంది. పదవులను కేటాయించేందుకు పార్టీ అధిష్ఠానం డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తుంది. 2017కు ముందు పార్టీలో పని చేసిన వారికే నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులను కేటాయించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్‌లో 2017 ఏడాది హాట్‌టాపిక్‌గా మారింది. 2014లో అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్‌లో తిరిగి అధికారాన్ని చేపట్టింది. పదేళ్ల పాటు అధికారంలో లేకపోవడంతో ముఖ్య నేతలంతా పార్టీని వీడి చెల్లాచెదురై పోయారు. మళ్లీ అధికారంలోకి రాగానే పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో పార్టీలో సీనియర్, జూనియర్ నేతల మధ్య ఆధిపత్య పోరుకు దారి తీస్తుంది. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర గడుస్తున్నా.. ఇప్పటి వరకు జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల జోలికే వెళ్లలేదు. దీంతో అధిష్ఠానం నిర్ణయం కోసం ఆశావహ నేతలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఏప్రిల్ 28న జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశానికి రాష్ట్ర పీసీసీ పరిశీలకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హందన్, చిట్ల సత్యనారాయణలు హాజరయ్యారు. త్వరలోనే నామినేటెడ్ పదవుల నియామకాన్ని చేపడుతామని ప్రకటించారు. కాగా, ముఖ్యనేతల అభిప్రాయాలు సేకరించకుండానే సమావేశాన్ని ముగించినట్లు పార్టీలో చర్చ సాగుతోంది.


సీనియార్టీతో గందరగోళం

నామినేటెడ్ పదవులను కేటాయించేందుకు సీనియార్టిని పరిగణలోకి తీసుకుంటే గందరగోళ పరిస్థితులకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్న ఒకరిద్దరు సీనియర్లు తప్ప అంతా ప్రజాధారణ ఉన్న నేతలెవరూ పార్టీలో కనిపించడం లేదు. అలాగే సామాజిక వర్గాల వారీగా పదవులను కేటాయిస్తే నేతల కొరత తప్పదంటున్నారు. పార్టీ ఇన్‌చార్జిలను కూడా పరిగణలోకి తీసుకునే అవకాశం ఉండదంటున్నారు. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పీఠంతో పాటు గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ చైర్మన్, ఆలయ చైర్మన్ పదవులు నియమించాల్సి ఉంది. అయితే సీనియార్టి ప్రతిపాదనతో సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ పట్టుతప్పే అవకాశం ఉందంటున్నారు. ప్రజాధారణ ఉన్న నేతకు నామినేటెడ్ పదవిని కట్టబెడితే పార్టీకి మరింత బలం చేకూర్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 80 శాతం మంది పోటీ నుంచి తప్పుకునే అవకాశం ఉంటుంది. సీనియర్, జూనియర్ అనే విభేదాలు లేకుండా పార్టీని ముందుకు నడిపించే వారికే పదవులను కేటాయిస్తే పార్టీకి కొంత వరకైనా న్యాయం జరిగే అవకాశం ఉందంటున్నారు.



రేసులో పలువురు నేతలు

గత రెండు, మూడేళ్లుగా జిల్లాలో పార్టీని ముందుకు నడిపించే నాయకత్వమే లేకుండా పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేశాడన్న ఆరోపణలతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. అప్పటి నుంచి డీసీసీ పదవిని భర్తీ చేయకుండానే నెట్టుకొస్తున్నారు. ఇదిగో అదిగో అంటూ డీసీసీ నియామకంపై అధిష్ఠానం తీవ్ర జాప్యం చేస్తూ వస్తోంది. డీసీసీ అధ్యక్షుడు లేకుండానే ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను కూడా పూర్తి చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే డీసీసీ అధ్యక్షున్ని నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఇటీవల డీసీసీ నియామకంపైనే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. అయినా అభిప్రాయ సేకరణ చేపట్టకుండానే సమావేశాన్ని ముగించారు. డీసీసీ రేసులో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డితో పాటు తలమడుగు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నరేష్ జాదవ్, ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ సోయం బాపురావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అలాగే



(తరువాయి 2వ పేజీలో...)



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

నీట్ పరీక్షకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మొత్తం 7 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1659 మంది విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే నీట్‌కు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకుకు జరిగే పరీక్షల్లో 1,659 మంది హాజరు కానున్నారు. వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాగా ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షీ షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు కూడా చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోనికి అనుమతించనున్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించనున్నారు. స్ట్రాంగ్ రూం నుంచి ప్రశ్న పత్రాలను పోలీసు బందోబస్తు నడుమ తరలించనున్నారు. అయితే ఎండ కాల నేపథ్యంలో కేంద్రాల్లో ఫ్యాన్‌లతో తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది కూడా అక్కడే ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా శనివారం సూచించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. ఎండలో ఎక్కువ సేపు ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చని అన్నారు. నీడలో ఉండడం, టోపీ, గొడుగు వంటి వాటిని ఉపయోగించడం మేలన్నారు. మధ్యాహ్నా వేళల్లో ఎండ ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువ సేపు ఉండవద్దని, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండడం మంచిదని తెలపారు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించాలని, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకుంటే మేలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి కోసం కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో పేరును తొలగించారంటూ తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన శేర్ల సుశీల శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాబితాలో పేరున్న స్థానిక నాయకులు కుమ్మక్కై తన పేరును తొలగించారంటూ ఆరోపించారు. అన్ని రకాలుగా ఇంటిని నిర్మించుకునేందుకు అర్హత ఉన్నా.. మంజూరు చేయడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా ఈ విషయమై మండల స్థాయి అధికారులను సంప్రదిస్తే అసలు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇచ్చోడ నూతన ఎస్సైగా పురుషోత్తం

ఇచ్చోడ, మే 3(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా పురుషోత్తం శనివారం బాధ్యతలు చేపట్టారు. జైనథ్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన ఇచ్చోడ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇచ్చోడలో విధులు నిర్వహించిన ఎస్సై తిరుపతి ఆదిలాబాద్ ఎస్పీ ఎస్సైగా బదిలీ అయినట్లు ఉత్తర్వులు జారీఅయ్యాయి.

రైతులు అప్రమత్తం కావాలి : వైద్యాధికారి

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): జొన్న పంట రైతులు అప్రమత్తం కావాలని తాంసి పశు వైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. జొన్న పంట కోసిన తరువాత వచ్చే లేపను పెరగకుండా వెంటనే దున్నుకోవాలని, లేదంటే పశువులు లేపను తిని మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్‌లోని బుర్కపల్లి, గోకొండ గ్రామాల్లో జొన్న లేపను తిని పెద్దసంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. వెంటనే రైతులు జొన్న లేప రాకముందే దున్నుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి సిహెచ్ రాజ్యలక్ష్మీతో కలిసి మాట్లాడారు. ఈనెల 14న జిల్లావ్యాప్తంగా ఆయా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాజీ పడదగ్గ కేసులను జరుగుతుందని, కక్షిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ అన్నారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టబోయే సార్వత్రిక సమ్మెలో జిల్లా మున్సిపల్ కార్మికులు పాల్గొనడానికి అనుమతి ఇవ్వాలని శనివారం కమిషనర్ సీవీఎన్ రాజుకు సమ్మె నోటిస్ అందజేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

నేరడిగొండ, మే 3(ఆంధ్రజ్యోతి): పశు పోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శనివారం మండలంలోని ఆరెపల్లి, కోర్టికల్, ధన్నూర్(డి) గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని అన్నారు. ఇందులో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటోకు క్షీరాభిషేకం

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడానికి హర్షిస్తూ శనివారం బోథ్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వం దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

- అవగాహన సదస్సులో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మైనార్లకు వాహనలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా మైనార్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో దాదాపు 290 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్ మైనార్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి ఆయా పోలీస్ స్టేషన్‌ల నుంచి ద్విచక్ర వాహనాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మైనార్‌లు డ్రైవింగ్ చేసి ప్రమాదలకు కారణం అయితే ఎలాంటి పరిహారం రాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత లైసెన్స్ తీసుకున్న తరువాతనే వారికి వాహనాలు ఇవ్వాలన్నారు. 14 ఏళ్లకే తన కొడుకు వాహనాలు నడపుతున్నాడని ఉప్పొంగిపోవద్దన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇటీవల హోలీలో పదో తరగతి విద్యార్థి ద్విచక్రవాహన యాక్సిడెంట్లో మరణించారని తెలిపారు. అలాంటి పరిస్థితి తల్లిదండ్రులకు రావొద్దని సూచించారు. పిల్లలను బయటకు పంపే సమయంలో వాహనాలు ఇవ్వొద్దన్నారు. జిల్లాలోనే తొలిసారిగా మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో 290 వాహనాలు గుర్తించడం జరిగిందన్నారు. మరోసారి వాహనాలు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అదే విధంగా గంజాయి తాగిన, విక్రయించిన, రవాణ చేసిన కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు వెంకటి, మురళీ, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఇచ్చోడలో ఆహార కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్



గుడిహత్నూర్ పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతూ

సిబ్బంది సమయపాలన పాటించాలి : డీఎంహెచ్‌వో

ఇచ్చోడ, మే 3(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో నరేందర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ పిహెచ్‌సీలో విధులు నిర్వహించే సిబ్బంది ఆసుపత్రి పనివేళలు, సమయపాలనా పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో తాగునీరు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా గుర్తించబడిన క్షయ వ్యాధిగ్రస్తులకు ఆహారకిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మధురిమ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

- గుడిహత్నూర్‌లో పీహెచ్‌సీ తనిఖీ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని వసతుల విషయమై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో ఈ సందరంగా పేర్కొన్నారు. అంతేకాకుండా సిజేరియన్ డెలివరీ వల్ల ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలను గర్భిణులకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు వడదెబ్బ భారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరించాలన్నారు. అలాగే, టీబీ కేసులను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫూడ్ బిస్కెట్లు అందజేశారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్యామ్ సుందర్, ఆయూష్ వైద్యురాలు సాదీయా సబోహి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ సంద అశోక్

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి : ఉద్యోగ జేఏసీ డిమాండ్

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ సంద అశోక్ అన్నారు. శనివారం టీఎన్జీఓ భవనంలో సమస్యల సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీని ఏర్పాటు చేయగా.. చైర్మన్‌గా అశోకను ఎన్నుకున్నారు. ఇచ్చిన హామీలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమిస్తామన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలలు దాటినా ఉద్యోగుల సమస్యల పరిష్కారం వైపు చూడడం లేదని జేఏసీ చైర్మన్ అశోక్ అన్నారు. 56 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినా పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలతో పాటు జీవో 317 సమస్యలు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని, మెడికల్స్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీగా ఏర్పాటు చేసుకున్నామని దశవారీగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నవీన్, శివకుమార్, సుదర్శన్, కొమ్ము కృష్ణ, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మండిపోతున్న ఎండలు

- అత్యధికంగా తలమడుగులో 42.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు ఆదిలాబాద్ జిల్లాలో తీవ్రమైన పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు మండిపోతున్న ఎండలతో జనం బెంబెలెత్తి పోతున్నారు. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.8 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 29.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యధికంగా తలమడుగు మండలంలో 42.7, సిరికొండలో 42.5, గుడిహత్నూర్‌లో 42.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 42.1, తాంసిలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జైనథ్ మండలం మినహా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. పగలంతా భానుడి భగభగలు రాత్రంతా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. క్షణం కరెంట్ పోయినా.. భరించలేని ఉక్కపోత కనిపిస్తుంది. అర్ధరాత్రి వరకు వడగాలుల ప్రభావం కనిపిస్తుంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలకు కూలర్లు, ఏసీలు కూడా పని చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎండల ప్రభావంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. ఉదయం సాయంత్రం వేళల్లోనే పనులను ముగించుకుని మధ్యాహ్నా రైతులు ఇంటికే పరిమితమవుతున్నారు.



- అంబేద్కర్ చౌక్ రోడ్డు ఇలా..



- ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న అశోక్‌రోడ్డు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ఉట్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యంను గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండలంలోని బీర్సాయిపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికార అధికారులతో పాటు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కలిగించేలా కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాథోడ్ రవీందర్, ఏపీడీ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

శని దేవుడికి ప్రత్యేక పూజలు

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం శని దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది నవధాన్యాలతో పాటు నువ్వుల నూనెను సమర్పించారు. కొందరు నల్ల వస్త్రాలను ధరించి శని దేవునికి పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచే ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఉన్న శని దేవునికి పూజలు చేసేందు కోసం జనం బారులు తీరారు. తాంసి మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయం జనంతో కిక్కిరిసిపోయింది. అలాగే పొన్నారి, కప్పర్ల, బండ నాగపూర్, హసనాపూర్, గ్రామాలలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అదేవిధంగా శని దేవుని పూజకు వచ్చే భక్తులకు ఎండ తాకిడి లేకుండా ఉండేందు కోసం ఆయా గ్రామాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. మొత్తం మీద శని దేవుని అమావాస్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పెళ్లయిన వారం రోజులకే.. ప్రియుడితో కలిసి ఆత్మహత్యాయత్నం..!!

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన వారం రోజులకే.. ఓ వివాహిత తన పాత ప్రియుడితో కలిసి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలానికి చెందిన రాజ్‌కుమార్, ప్రవల్లిక గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల అమ్మాయికి కుటుంబీకులు వివాహం చేశారు. అయితే పెళ్లయిన వారం రోజులకే ప్రియుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆ వివాహిత ఆదిలాబాద్‌కు వచ్చి సీసీఐ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కాగా గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వన్ టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

ఇద్దరు అరెస్ట్, ఒకరి పరార్ : డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం ఓ కేటరింగ్ వాహన వ్యక్తులను బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ క్యాటరింగ్ వాహనాన్ని ఆపి సుధీర్, మోసిన్, జావిద్ వాహనానికి సరైన పత్రాలు లేవంటూ బెదిరించారు. రూ.20 వేలు తీసుకున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వారిలో మోసిన్ , జావిద్‌ను అరెస్ట్ చేయగా, సుధీర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు.

పోలీస్ విధులకు ఆటంకం : సీఐ

ఆదిలాబాద్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో విధులలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్సైకు ఆటంకపరచిన వ్యక్తి గటిక ముఖేష్‌ను అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి రవీంద్ర నగర్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్సైతో వాగ్వాదానికి దిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విధులు నిర్వర్తించకుండా ఆటంకపరిచిన కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇతనిపై వన్ టౌన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



మాంగూర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



జడ్పీ మీటింగ్ హాల్‌లో లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తూ..

గిరిజన రైతుల భూ సమస్యలను పరిష్కరించాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, మే 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఏజెన్సీ గిరిజన రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జైనథ్ ఉమ్మడి మండలంలోని మాంగూర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాత్నాల మండలంలోని సుందర గిరి మాంగూర్ల గ్రామాలలో గల రైతుల భూములకు పట్టలేక చనిపోతే వారికి ఆర్థిక సహాయం అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంలో గిరిజనరైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్డీఓ వినోద్‌కుమార్, సాత్నాల తహశీల్దార్ మడావి విశ్వనాథ్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆస్తక్ సుభాష్, సాత్నాల, మాంగూర్ల, సుందరగిరి గ్రామాల రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: పేదింటి ఆడ పిల్లల పెళ్లి చేయలంటే తల్లిదండ్రులు పడే కష్టం తనకు తెలుసని, ప్రభుత్వం నుంచి వచ్చే సాయం కూడా త్వరగా అందిస్తే భారం తగ్గుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో బోరజ్, బేల, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన ఈ సందర్భంగా అందించారు. ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. ఆడ పిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు సంతోషంగా ఉన్న పేద వారిలో ఆర్థిక సమస్య ఎక్కువగా పీడిస్తుందన్నారు. అలాంటి పేదింటి ఆడ బిడ్డ పెళ్లి కోసం ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దీంతో వారికి కొంత అప్పుల బాధతగ్గుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయంపై నమ్మంతో వడ్డీకి తీసుకువస్తున్నార న్నారు. సాయం కూడా సంవత్సరం, ఆరు నెలలకు రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. త్వరగా సాయం అందేల చూడాలని అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, బోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి, తదితరురులు పాల్గొన్నారు.

పశు పోషణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పశు పోషణ పట్ల జాగ్రత్తగా ఉండాలని పశు వైద్యాధికారి డాక్టర్ సుశీల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కౌట(బి) గ్రామంలో పశువులకు ముందస్తు వ్యాధి నివారణ టీకాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల వివిధ రకాల వ్యాధులు సోకుతాయని, అయితే రైతులు ముందస్తు టీకాలను తప్పనిసరిగా పశువులకు ఇప్పించాలన్నారు. ఇందులో వీఏ రాజేందర్, రమేష్, బీరయ్య, బాలు, గోకుల్, లచ్చన్నలు పాల్గొన్నారు.

క్షయ రోగులకు సరుకుల పంపిణీ

ఉట్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ రోగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, యాక్ట్ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ మెంబర్ దళిత రత్న కాటం రమేష్, పీహెచ్‌సీ డాక్టర్ సందీప్‌ల ఆధ్వర్యంలో రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి మందులు ప్రతినిత్యం తప్పకుండా వాడితే తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. వైద్య సిబ్బంది సూచించిన విధంగా మందులు వాళ్లతో, పథ్యం కూడా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృప, శ్రీరామ్, వసంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి భరోసా

తాంసి, మే 3 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన అసిలి పొచ్చెన్న అనే రైతు ఇటీవల ఆదిలాబాద్‌లోని రైతు బజార్‌లో కూరగాయాలు అమ్ముతూ విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. అయితే, ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా సహాయం అందేవిధంగా చూస్తామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర ఉన్నారు.

ఆదిలాబాద్‌లో పలువురు ఎస్సైల బదిలీలు

● ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌అర్బన్, మే3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది మంది ప్రొఫెషనల్ ఎస్సైలు, 11 మంది రెగ్యూలర్ ఎస్సైలను బదిలీ చేస్తూ ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఎ. తిరుపతి ఇచ్చోడ పోలీసు స్టేషన్ నుంచి డిస్టిక్ స్పెషల్ బ్రాంచ్ అటాచ్ టు ఆదిలాబాద్ టూ టౌన్, వి.పురుషోత్తం జైనథ్ పోలీసు స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీసు స్టేషన్, పి.దివ్యభారతి బేల పోలీసు స్టేషన్ నుంచి తాంసి పోలీసు స్టేషన్, కె.నాగనాథ్ వీఆర్ ఆదిలాబాద్-బేల, డి.రాధిక తాంసి నుంచి తలమడుగు, పి.గౌతమ్ గుడిహత్నూర్ నుంచి జైనథ్ పోలీసు స్టేషన్, బి.అంజమ్మ తలమడుగు నుంచి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్ అటాచ్‌టు ఆదిలాబాద్ వన్‌టౌన్, డి.శివరాం, సిరికొండ పోలీసు స్టేషన్ నుంచి ఆదిలాబాద్ టు టౌన్ పోలీసు స్టేషన్ అటాచ్, జి.అప్పారావు ఆదిలాబాద్ హెడ్ క్వాటర్స్ నుంచి ఉట్నూర్ పోలీసు స్టేషన్ అటాచ్, డి.పద్మ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీసు స్టేషన్ అటాచ్, కె.రవీందర్ ఆదిలాబాద్ టూ టౌన్ నుంచి మావల పోలీసు స్టేషన్ అటాచ్ బదిలీ అయిన వారిలో ఉన్నారు. నెల పాటు ఎస్‌హెచ్‌ఓలుగా కొమ్ము అఖిల్ నార్నూర్ పోలీసు స్టేషన్, గడ్డం రమ్య జైనథ్ పోలీసు స్టేషన్, బొడపీర్‌సింగ్‌నాయక్ భీంపూర్ పోలీసు స్టేషన్, ఎస్ శ్రీసాయి సిరికొండ పోలీసు స్టేషన్, పిల్లి ప్రణయ్‌కుమార్ మావల పోలీసు స్టేషన్, సతలపల్లి పూజ ఉట్నూర్ పోలీసు స్టేషన్, గడ్డల సంజయ్‌కుమార్ ఇచ్చోడ పోలీసు స్టేషన్, కోట రాజశేఖర్‌రెడ్డి బజార్‌హత్నూర్, ఎస్ జీవన్‌రెడ్డి గాదిగూడ, యనకి మధుకృష్ణ, గుడిహత్నూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

వాహనాల తనిఖీ

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం వాహనాల తనిఖీని పోలీసులు ముమ్మరంగా చేపట్టారు. వాహనాలకు సంబంధించి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పదవులకు పోటాపోటీ!

(1వ పేజీ తరువాయి...)

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీ నిర్ణయమే ఫైనల్

2017 డెడ్‌లైన్‌తో కొంత మంది సీనియర్ నేతలకు భరోసా కనిపిస్తున్నా.. ఎన్నికలకు ముందు అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ లో చేరిన జూనియర్ నేతల్లో మాత్రం హైటెన్షన్ కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. పార్టీలో చేరే సమయంలో అగ్రనేతల హామీతోనే కాంగ్రెస్ కండువా వేసుకున్నట్లు తెలుస్తుంది. అయితే సీనియార్టిని బట్టి పదవులను కేటాయిస్తే సగం కాంగ్రెస్ ఖాళీ అయ్యే అవకాశం ఉందంటున్నారు. అలాగే మెజార్టీ నేతలు అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అన్ని నియోజక వర్గాల్లో సీనియర్, జూనియర్ అనే లొల్లి మొదలయ్యింది. పార్టీలో సీనియర్లకు అసలే ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వచ్చిన నేతలే కీలకంగా కనిపిస్తున్నారు. వీరందరి అభిప్రాయం మేరకే నామినేటెడ్ పదవులను కేటాయించాల్సి ఉంటుంది. ఒకవేళ మొండిగా వ్యవహరిస్తే పార్టీకే నష్టమన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు పార్టీలో విభేదాలు తలెత్తితే అసలుకే మోసం జరిగే అవకాశం ఉందంటున్నారు. మొత్తానికి పార్టీ నిర్ణయమే ఫైనల్ అంటూ కాంగ్రెస్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో? చెప్పలేమని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

ఇంటర్ ప్రవేశాల కోసం లెక్చరర్లు ప్రయత్నించాలి : ప్రిన్సిపాల్

ఉట్నూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం లెక్చరర్లు ప్రయత్నించాలని ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉట్నూర్‌లో ప్రథమ సంవత్సరం జాయిన్ అవ్వడానికి అడ్మిషన్లు ప్రారంభమైనవని అన్నారు. పదవతరగతి పాసైన విద్యార్థులు జూనియర్ కళాశాలలో ప్రవేశాలు తీసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడిహత్నూర్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(25) హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. మన్నూర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాంసి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం అధికారులు పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం 63 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో సంబంధిత గ్రామ కార్యదర్శి లావణ్య లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చేపట్టాలని ఆమె సూచించారు. త్వరితగతిన బిల్లుల విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దన ఆమె లబ్ధిదారులకు సూచించారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'

బోథ్, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రభుత్వ పరంగా మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి ఇన్‌చార్జి ఆడె గజేందర్ సహాయ సహకారాలతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు.



డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును సన్మానిస్తున్న దృశ్యం

సోన్‌లో నిర్మల్ డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సోన్ గ్రామ ప్రజల తరఫున శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును సన్మానించినట్లు సోన్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సోన్ మండల కేంద్రానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వకుండా పది సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామానికి 100 ఇందిరమ్మ ఇళ్లు సాంక్షన్ చేయడంతో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, అంబేకర్ ప్రసాద్, మొయినుద్దీన్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన పీసీసీ పరిశీలకుడు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు శేఖర్‌గౌడ్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, ఆధ్వర్యంలోని కార్యకర్తల చొరవ, రానున్న కార్యాచరణపై సమీక్ష జరిపినట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులు, రాజకీయ దిశలో మార్పులు, ప్రజాభిప్రాయంపై కూడా ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని శాలువాతో సన్మానిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో పట్టణంకు చెందిన భూపాల్‌రెడ్డి లక్ష్మీల కూతురు నైనారెడ్డిని శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉత్తమమైన మార్కులు సాధించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

పరామర్శ

కుభీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ వత్సలబాయి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ముథోల్ బీఆర్‌ఎస్ నియోజక వర్గ సమన్వయ సభ్యులు డాక్టర్ కిరణ్‌కొమ్రెవార్ శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదే విధంగా నిగ్వా గ్రామంలో ఇటీవల మృతి చెందిన సుశీలబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

● నిర్మల్ జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నిర్మల్ జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం అన్నారు. పట్టణంలోని సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో, డీఈఎం, ఆర్‌టీ, ఏడీఈ, ఏఈ, సబ్ ఇంజనీర్స్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

6న ముథోల్ నియోజక వర్గ

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

భైంసా, మే 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఈ నెల 6న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కమల జిన్నింగ్ ఫ్యాక్టరీ ఎదుటగల శ్రీ బాంకెట్‌హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని ప్రకటనలో తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, డైరెక్టర్లతో పాటు పార్టీ అన్ని విభాగాల కార్యవర్గ ప్రతినిధులు, శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు విధిగా సమావేశానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశువుల పాక దగ్ధం

కుభీర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నయాబాది కాలనీలో పోగుల పోతన్న అనే రైతుకు సంబంధించిన పశువుల పాక శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం పశువుల పాక వెనక చెత్తకు ఎవరో కాలనీ వాసులు నిప్పంటించగా అది కాలుతూ కాలుతూ మంటలు చెలరేగి పశువుల పాకకు అంటుకుంది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. రైతుకు సంబంధించిన వ్యవసాయ సామాగ్రి, డ్రిప్ పైపులు తదితర వస్తువులు కాలిపోయాయని సుమారు రూ. 50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అగ్ని మాప సిబ్బంది, ఫైర్ ఆఫీసర్ ఎం. రవి, సిబ్బంది ఏ రాజజేందర్, విలాస్, కరణ్‌సింగ్, హార్నిన్ ఉన్నారు.



దగ్ధమైన పశువుల పాక సామగ్రి

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పద్మాకర్, ముజాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఏపీఎం బోసు, సీసీ రేఖ, ఇతర లీడర్స్, గ్రామ సెక్రటరీ వినోద్‌కుమార్, వీడీసీ సభ్యులు, గ్రామంలోని రైతులు, వీవో అధ్యక్షురాలు రబియాబి, వీవో సభ్యులు, వీవోఏ గంగాజల పాల్గొన్నారు.

ముజ్గి గ్రామంలో..

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం ముజ్గి గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు ధర్మాజీ రాజేందర్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, ముజ్గి గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి అందరూ సహకరించండి

● టీఎంయూ రీజనల్ కార్యదర్శి ఆర్. గంగాధర్

నిర్మల్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే ఆర్టీసీ సమ్మె విజయవంతానికి సంస్థలో పని చేస్తున్న కార్మికులందరూ సహకరించి సమ్మె విజయవంతానికి కృషి చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియర్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజనల్ కార్యదర్శి ఆర్. గంగాధర్ ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో యాజమాన్యం మొండివైఖరి, కార్మికులపై అధిక పని భారం, అత్యవసర పరిస్థితుల్లోను సెలవు ఇవ్వకపోవటం, మహాలక్ష్మి పథకం వల్ల చేయని తప్పులకు సైతం అధికారుల వేధింపులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు మేనిఫెస్టోలో హామీలను నెరవేర్చకపోవటం, రెండు వేతన సవరణలు పెండింగ్‌లో పెట్టటం, ముఖ్యంగా కార్మికులపై అధికారుల వేధింపు చర్యలు వంటి వాటికి నిరసగానే సమ్మె చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

అడ్వాన్స్ సప్లిమెంటరీ

పరీక్షలకు 16లోగా దరఖాస్తు చేసుకోవాలి

● నిర్మల్ జిల్లా విద్యాధికారి పి. రామారావు

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి తప్పిన విద్యార్థులకు జూన్ 3 నుంచి 13 తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులు మే నెల 16 తేదీలోపు పరీక్ష రుసుము చెల్లించాలని జిల్లా విద్యాధికారి పి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రుసుములను ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలన్నారు. రూ. 50 ఆలస్య రుసుముతో సబ్జెక్టు పరీక్ష జరిగే ముందు రెండు రోజుల వరకు చెల్లించవచ్చని, మార్కుల పునఃలెక్కింపుకు ఒక్కో సబ్జెక్టుకు రూ. 500ల చొప్పున బ్యాంకు చలానా తీసి.. ఫారమ్ పూర్తి చేసి దాన్ని మే నెల 15వ తేదీలోపు హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల విభాగానికి పోస్టు ద్వారా నేరుగా పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పునఃపరిశీలన, జవాబు పత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ. 1,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరించి జిల్లా డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో సమర్పించాలని, అందుకు మే 15వ తేదీ తుది గడువు అని ఆయన తెలిపారు.

వేసవి శిబిరాలు ప్రారంభం



మండల కేంద్రంలోని వేసవిశిబిరంలో పాల్గొన్న విద్యార్థుల సాధన

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శనివారం సమ్మర్ క్యాంపును ఎంఈవో ముత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవిసెలవుల్లో ఈ క్యాంపును సద్వినియోగపరుచుకోవాలన్నారు. క్యాంపుకు రావడం వలన విద్యార్థులు వృథాగా తిరగడం జరగదన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే క్యాంపులు మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూరులో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు జరిగే విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు లేదా 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇట్టి క్యాంపులో విద్యార్థులకు ఆటల పోటీలు, డ్యాన్సు, మ్యూజిక్, డ్రాయింగ్, తదితర వాటిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 25 మంది విద్యార్థులకు ఒక వాలంటీర్‌ను నియమించి ఈ క్యాంపును కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పట్ల అప్రమత్తంగా ఉండాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దిలావర్‌పూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవికాలం దృష్ట్యా నీటిఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులపై ఆరా తీశారు. ఎక్కడ నీటి సమస్య ఉన్న ఎంపీడీవో దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీటి సమస్యను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా


గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదే శాల మేరకు ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు, గ్రామ రెవె న్యూ సదస్సులో భాగంగా జిల్లాలోని బోరజ్ మండలాన్ని పైలెట్ ప్రా జెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి సద స్సులు నిర్వహించే ప్రదేశంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని శని వారం గూగుల్ మీట్ ద్వారా తహసీల్దార్లకు పలు సూచనలు, సలహాలు, దిశా నిర్దేశం చేశారు. జిల్లా కేంద్రాలను మినహాయించి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దర ఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే బోరజ్ మండలాన్ని పైలెట్‌గా తీసుకోవడం జరిగిందని తెలిపారు. బోరజ్ పైలెట్‌లో మూడు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే విధంగా గ్రామానికి వెళ్లే ముందు రోజు గ్రామాల్లో టామ్ టామ్ చేయించాలని, సంబంధిత అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. రికార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. 28 గ్రామాల్లో సదస్సులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల, రెవెన్యూ సదస్సుల ప్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరకాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. పట్టాలు ఉండి పోజిషన్‌లో లేని దరఖాస్తులు కూడా పరిశీలించాలన్నారు. హైకోర్టు అనుమతులు రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యచరణను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల చివరికల్లా రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారంచూపాలన్నారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్‌డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్లు, ఏడీ సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై ఇంటలిజెన్స్ పోలీసుల ఆరా

బోథ్, మే 3 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల పైన ప్రత్యేక పోలీసు యస్‌బి ఇంటలిజెన్స్ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగానే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇంటలిజెన్స్ ఎస్పీ పోలీసులు వడ్డీ వ్యాపారుల వివరాలు సేకరి స్తున్నట్లు సమాచారం.

● వ్యాపారులు ఎక్కువ.. కేసులు తక్కువ

మండలంలో వడ్డీ వ్యాపారాలు నిర్వహించి వారు అధిక మొత్తంలో ఉన్న కేవలం దినసరి వడ్డీ వ్యాపారం ఫైనాన్స్ వ్యాపారం చేసే వారిపైన అధికారులు కేసులు నమోదు చేసి ఊరుకున్నారన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో మిగతా పెద్ద మొత్తంలో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి పైన కేసులు నమోదు చేయాలని పోలీసులు నిర్ణయించి నట్లు సమాచారం. దీంతో అధిక మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్న వారి జాబితాను సిద్ధం చేసి జిల్లా ఎస్పీకి అందించడం తెలిసింది.

● చిట్టీ వ్యాపారులపై నిఘా

ఇలాంటి అనుమతులు లేకుండా చిట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వారిపైన పోలీస్ అధికారులు నిఘ వేసినట్లు తెలిసింది. అయితే మండలంలో లక్షలాది రూపాయల చిట్టి వ్యాపారాలు కొనసాగుతున్నట్లు అధికారులు ఇప్పటికే సమాచారాన్ని సేకరించడం జరిగింది. కమిషన్ పైన నిర్వహించే ఈ చిట్టి వ్యాపారం రోజురోజుకు విస్తరిస్తుండడంతో అధికారులు ఈ వ్యాపారం పై దృష్టి సారించినట్లు తెలిసింది. అంతేగాక గతంలో జిల్లాలో చిట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఎంతోమంది పరారీ కావడంతో మును ముందు ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలన్న దృక్పథంతో చిట్టి వ్యాపారంపై కన్నేసినట్లు తెలిసింది. పట్టణాల నుంచి పల్లెల వరకు విస్తరిస్తున్న ఈ వ్యాపారం పై పోలీసులు కొరడా ఝులిపించినట్లు తెలిసింది.

● వడ్డీ వ్యాపారం భాగస్వాములపై నిఘా

ఫైనాన్స్ వ్యాపారాలను చిట్టి వడ్డీ వ్యాపారాలను నిర్వహిస్తున్న వారి జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా అనే విషయాన్ని అధికారులు నిర్ధారణ చేస్తున్నారు. ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులు చిట్టి వడ్డీ వ్యాపారాలు చేస్తుండడంతో ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడం వల్ల ఈ వ్యాపారాన్ని కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. మొదట రోజు వారీ ఫైనాన్సు వడ్డీపై దృష్టి పెట్టి కట్టడి చేస్తున్న అధికారులు ఈసారి వడ్డీ చక్రవడ్డీ వ్యాపారులపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఇండ్లు, భూములు బంగారం వాటిని తనకా పెట్టుకుని బాండ్ పేపర్ల పైన వ్యాపారాలు నిర్వహించే వారి పైన ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అయితే ధర్మ వడ్డీ అంటే రెండు శాతం వడ్డీతో అప్పులు ఇచ్చిన వారిపట్ల కఠినంగా వ్యవహరించవద్దని మూడు నాలుగు శాతం పైన చక్రవడ్డీ వ్యాపారం పైన కఠినంగా వ్యవహరించాలని పోలీసులు చర్యలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

కృత్రిమ మేధస్సు తరగతుల ప్రారంభం


ఉట్నూర్‌లో ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉట్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏఐ (కృత్రిమ మేధస్సు) తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, మండల విద్యాధికారి రాపెల్లి ఆశన్న, సీఆర్‌పీ ప్రవీణ్, ధరంసింగ్‌లు పాల్గొన్నారు.


వివిధ చిత్రాలు వేసిన సాయి కుమార్

వృత్తి టీచర్.. ప్రవృత్తి చిత్రలేఖనం

● చేతి వేలుతో సెల్ ఫోన్‌పై బొమ్మలు గీయడంలోనూ దిట్ట ● చిత్రలేఖనంలో ఘనుడు..సాయికుమార్

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆలోచనలకు మెరుగులద్ది చిత్రాలుగా మలుస్తాడు. ప్రకృతిని కుంచెతో ఒడిసిపడుతాడు. బొమ్మలకు ప్రాణం పోస్తాడు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన సాధుల సాయి కుమార్ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి చిత్రలేఖనంలో ఘనుడు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. సాయి కుమార్ ఐదవ తరగతిలోనే చిత్రకళపై ఆకర్షితులయ్యారు. అతని అన్నయ్య ఉదయ్, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బసవ రాజుల ప్రోత్సాహంతో చిత్రకళలో ప్రావీణ్యం సాధిస్తున్నాడు. మండలంలోని బోరిగాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ మరోపక్క చిత్రలేఖనం గీస్తూ ఎందరికో చిత్రలేఖనం నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.




సుద్దముక్కపై చిత్రాని చెక్కుతున్న దృశ్యం



చిత్రాలకు జీవం...

సాయి కుమార్ ప్రతీ బొమ్మకు ప్రాణం పోస్తాడు. సమాజానికి ఉపయోగపడే ఎన్నో సందేశాత్మక చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలు వారాయి. మారుతున్న కాలమాన పరిస్థితులలో ప్రకృతికి వాటిల్లుతున్న నష్టాలను చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తున్నాడు. పెన్సిల్ వర్క్, వాటర్ కలర్, పెయింటింగ్‌లలో దిట్ట. మనుషుల చిత్రాలు క్షణాల్లో గీస్తాడు. సుద్ద ముక్క పైన, గిడాల పైన, కాగితాల పైన దేశ నాయకుల చిత్రాలను, బడి పిల్లలు హరితహారంకు సంబంధించిన చిత్రాలు, దేవుడి బొమ్మలు, గ్రామీణ అందాలు, ప్రకృతి ఒడి, బాల కార్మికుల జీవనం, ఆహ్లాదం కలిగించే రమణీయ దృశ్యాలు, పుష్పాలు, చెట్లు, వాయిద్యాలు వేసిన తదితర చిత్రాల్లో జీవం ఉట్టి పడుతుంది. నిలబడ్డ చోటే వ్యక్తులకు చిత్ర రూపం ఇవ్వడంలో మేటి. అలాగే చేతి వేలుతో సెల్ ఫోన్ తెరపై బొమ్మలు గీయడంలో దిట్ట.

వచ్చిన కళ ఇతరులకు నేర్పాలన్నదే నా లక్ష్యం

● సాధుల సాయి కుమార్, ప్రభుత్వ టీచర్



నేను నేర్చుకున్న కళను ఇతరులకు నేరాలన్నదే నా లక్ష్యం. మా గ్రామంలో నేను విధులు నిర్వహిస్తున్న చోట ఆసక్తి గలవారికి బొమ్మలు వేయడం, వేయించడం నా లక్ష్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మంచి కోసం నా చిత్ర లేఖనం కొనసాగుతూనే ఉంటుంది.

చెక్ డ్యామ్ పూర్తయితే పంట వేసేందుకు వెళ్లేదెలా..!?

● వంతెన నిర్మించి వసతి కల్పించండి

బోథ్, మే 3 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపు కోసం మండలంలోని పెద్ద వాగుపైన రాష్ట్ర ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. అయితే ఇప్పటికీ నాలుగు చెత్తగా మరో చెక్ డ్యామ్ పొచ్చెర వాగుపై నిర్మాణం చేపట్టారు. దాదాపు ఐదు కోట్ల రూపాయలతో మంజూరైన చెక్ డ్యామ్ నిర్మాణం ప్రారంభమైంది. అయితే చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల రైతులకు మేలు జరుగుతున్న జగ్గంపై భాగంలో ఉన్న దాదాపు 100 మంది రైతులకు రోడ్డు వసతి లేకుండా పోతుందని వాపోతున్నారు. అయితే చెక్ డ్యామ్ నిర్మాణంపై భాగంలో గతంలో ఒక చెక్ డ్యామ్ నిర్మించాలని డిమాండ్ చేయగా అధికారులు నిర్మిస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. అయితే చెక్ డ్యామ్‌పై భాగంలో బ్రిడ్జి నిర్మించి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


పొచ్చెర వాగుపై నిర్మాణంతో ఉన్న చెక్ డ్యామ్

● పంట నష్టపోయే ప్రమాదం ఉంది



అధికారుల నిర్ణయం మంచిదే అయినా చెక్ డ్యామ్‌పై భాగంలో వర్షా కాలం నీరు నిలవడంతో తమ చేలకు వెళ్లే అవకాశం కోల్పోవాల్సి వస్తుందని రైతు చిలుకూరి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. తాము గతంలో నిర్మించిన చెక్ డ్యామ్ వల్ల పై భాగంలో చేలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గుర వుతున్నారు. అయితే ప్రభుత్వం మరోచెక్ డ్యామ్ నిర్మానం చేపట్టడం వల్ల ఈ ఏడాది తమ చేన్‌లలోకి దారి లేకి బ్బంది పడాల్సి వస్తుందన్నారు. దాదాపు తమ గ్రామానికి చెందిన మూడు వందల ఎకరాల భూమి ఎలా సాగు చేయాలో అర్థం కాక రైతులు ఆందోళన చేస్తున్నారు.

- చిలుకూరి రమేష్‌రెడ్డి రైతు

● నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలి



ప్రభుత్వం చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి కాకముందే ప్రభుత్వం చెక్ డ్యామ్ అవతల ఉన్న రైతులకు ముందుగా వంతెన నిర్మించి ఇవ్వాలని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు.

- కొట్టాల గంగారెడ్డి, రైతు

ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులు ఎప్పుడో..!?

● గిరిజనుల ఆవేదన


గిరిజన గ్రామం పిట్ల గూడెం


పిట్లగూడెం వంతెనపై తాత్కాలికంగా మొరం పోసిన దృశ్యం

ఉట్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా కురుస్తున్న వరాకాలం వర్షాలకు కొట్టుకు పోతున్న వంతెనకు శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేస్తారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని టక్కుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పిట్లగూడెం గ్రామంలో 70 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయి. ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుమురంభీం ప్రాంగణం మీదుగా దేవానగర్ నుంచి పిట్లగూడెం రోడ్డుపై వాగుపై ఉన్న వంతెన ప్రతీ వర్షాకాలం కొట్టుకు పోతుంది. వర్షాకాలం వచ్చిందంటే పిట్లగూడెం గ్రామ గిరిజనులు కాలిబాటన పెరకగూడెం చేరుకొని ఉట్నూర్, ఆదిలాబాద్ వైపు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఉట్నూర్ నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిట్లగూడెం కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్థులు చుట్టూరా 5కిలోమీటర్లు తిరిగి ఉట్నూర్ వెళ్లాల్సి వస్తుంది. ఏ చిన్న పని కోసం అయినా వైద్యం కోసం అయినా ఇబ్బంది పడాల్సి వస్తున్నదని గిరిజనులు తెలిపారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు నిర్మాణంలో నాణ్యత లోపం ఉండడంతో పాటు ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికలు లేకుండా చేపట్టిన నిర్మాణంతో చిన్నపాటి వర్షాలకు ఈ వంతెన వద్ద ఉన్న వాగు పొంగి ప్రవహించడంతో కల్వర్టు కొట్టుకుపోతుంది. రెండేళ్ల క్రితం కొట్టుకు పోయిన కల్వర్టుకు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయగా గ్రామస్థులే మొరం పోసుకుని దానిపైన తాత్కాలిక రోడ్డు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా కల్వర్టును ఇంజనీరింగ్ అధికారుల ప్రమాణాలతో నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన కమిటీ నియామకం

● చైర్మన్‌గా అంగూరి మహేష్‌కు అవకాశం


కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం

దిలావర్‌పూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధమైన కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నూతన కార్య వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న దేవస్థానం కమిటీ నియామకం ఎట్టకేలకు పూర్తికావడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో పది రోజుల్లో శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్స వాలు ఉండటంతో ఈ నెల 5వ తేదీనే నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్స వానికి దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దేవస్థానం నూతన కమిటీ ఇదే..

కాల్వ దేవస్థానం నూతన కార్యవర్గంలో 13 మంది సభ్యులకు స్థానం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అంగూరి మహేందర్, గుమ్ముల చిన్న నర్సయ్య, గట్టు కాశీనాథ్, జాదవ్ పుష్ప, వి. శివకుమార్, గడ్డం నర్సారెడ్డి, పూదరి శివ కుమార్, దాసరి శ్రీకాంత్, గైని దేవేందర్, సూర నవీన్ కుమార్, ఆకారపు లక్ష్మణ్, నూతికట్టు సాయన్న, చిన్నోల్ల లక్ష్మారెడ్డిలకు నూతన కమిటీలో స్థానం లభించింది.

చైర్మన్‌గా అంగూరి మహేందర్..

డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావుకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన కాల్వ గ్రామానికి చెందిన అంగూరి మహేందర్ కాల్వ దేవస్థానం నూతన చైర్మన్ అయ్యేందుకు అవకాశముంది. అధికార పార్టీలో చురుకైన కార్యకర్తగా, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మహేందర్ చైర్మన్ కావడం లాంచనమేనన్న ప్రచారం ఉంది. ఈ నెల 5వ తేదీన సోమవారం నూతన పాలకవర్గం కొలువుదీరనుంది.

తాగునీటి కోసం మూగ జీవాల వెతలు


వాగులో నీళ్ల కోసం పరితపిస్తున్న గేదెలు

తాంసి, మే 3 (ఆంధ్రజ్యోతి): జనాలకే కాదు.. మూగజీవాలకు సైతం తాగునీటి ఇబ్బంది తప్పడం లేదు. ఒకపక్క మేత కరువు మరో పక్క నీళ్ళు దొరకక మూగ జీవాలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కావు. తాంసి మండలంలోని ఏ ఒక్క వాగులో సైతం చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. దీంతో మూగ జీవాలకు నీటి కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గ్రామాలలోనే పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటి నీటి సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఫోటో న్యూస్

క్రీడా ప్రాంగణం.. బోర్డుకే పరిమితం


బోథ్ మండలం మండబోగుడ రఘునాథపురం

గ్రామీణ ప్రాంతవాసులు వివిధ క్రీడల్లో నైపుణ్యాలు సాధించేందుకు అప్పటి ప్రభుత్వం ఊరురా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి నెలకొల్పిన ఈ అబ్‌స్ట్రాక్ట్ ఎందుకు పనికి రాకుండా పోయాయి. అనేక గ్రామాల్లో ఖాళీస్థలాలు, పాఠశాల మైదానాలతో పాటు కొన్ని చోట్ల డంపింగ్ యార్డులకు కేవలం బోర్డులు తగిలించి బిల్లులు తీసేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా వీటితో గ్రామీణులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)



సిరికొండ మండలం సుంకిడి గ్రామం



బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం

andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 : కనిష్ఠం 26.5

ఆంధ్రజ్యోతి

నిర్మల్ జిల్లా వార్తలు

4

ఆదివారం 4 మే 2025





మారుమూల పల్లెలకు కరెంటు కష్టాలు

- శాపమవుతున్న అటవీశాఖ అనుమతులు
- కష్టాల కడలిలో పదమూడు పల్లెలు
- సమస్యగా మారిన అనుమతుల సాధన
- రాష్ట్ర సర్కారు ఒత్తిడి తీసుకువస్తేనే జిల్లాలోని పల్లెలకు విద్యుత్ సౌకర్యం

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

జిల్లాలోని అనేక మారుమూల గిరిజన పల్లెలకు గత 50 సంవత్సరాల నుంచి కరెంటు సౌకర్యం అందడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం వస్తుందని గిరిజనులు ఆశపడ్డారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పల్లెలకు కరెంటు సౌకర్యం అందించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పెంబి, కడెం మండలాల్లోని 16 గ్రామాలు కరెంటు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నాయి. కాగా ఇందులో నుంచి మూడు గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్‌ఫేస్ కరెంటు సౌకర్యం కూడా లేకపోవడంతో ఆ గ్రామాలన్నీ అంధకారంలోనే మగ్గుతున్నాయి. మరో 13 గ్రామాల గిరిజనులు మాత్రం త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కోసం అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో నేతలంతా గ్రామాలకు వెళ్ళి కరెంటు సౌకర్యం కల్పిస్తామంటూ హామీల వర్షం కురిపించడం రివాజుగా మారింది. ఎన్నికల తరువాత ఈ పల్లెల వైపు ఏ ఒక్కనేత కన్నెత్తి చూడడం లేదంటున్నారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే చాలాసార్లు మూడు గ్రామాలకు సింగిల్ ఫేజ్ కరెంటు, మరో 13 గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.



కరెంటు సౌకర్యానికి నోచుకోని మారుమూల గిరిజన పల్లె

దీనికి సంబంధించి అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించే విషయంలో వెనకడుగు వేయాల్సి వస్తోంది. అప్పటి ప్రభుత్వం అటవీశాఖ ద్వారా అనుమతులు సాధించడంలో పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలున్నాయి. గ్రామాలన్ని కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున ఇక్కడ అటవీశాఖ అనుమతులు సాధించడం కష్టతరంగా మారింది.

కరెంటు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు

కరెంటు కోసం 16 గ్రామాలు ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాయి. ఇందులో నుంచి మూడు గ్రామాలు అసలు కరెంటు సౌకర్యానికి నోచుకోక తల్లడిల్లుతుండగా మరో 13 గ్రామాలు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. పెంబి మండలంలోని పోచంపెల్లి (సోముగూడ), పెదరాగిదుబ్బ, గోదుమల గ్రామాలకు ఇప్పటి వరకు సింగిల్‌ఫేజ్ కరెంటు సౌకర్యం కూడా లేదు. అలాగే ఇదే మండలంలోని జీడిమల్లి తాండ, గోరి పెద్దయ్య గూడెం, కోరకంటి, ఉసాగుట్ట, రాగిగూడ, జంగుగూడ, సాకిగూడ, రామాగూడ, కొత్తగూడ, ఇస్లాంపూర్, కడెం మండలంలోని గండి గోపాల్‌పూర్, ఇస్లాంపూర్, మీది చింత గ్రామాలు త్రీఫేజ్ కరెంటు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆటంకమవుతున్న అటవీశాఖ అనుమతులు

పెంబి, కడెం మండలంలోని 16 గిరిజన గ్రామాలు కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి వస్తుండడంతో ఆ గ్రామాలకు కరెంటు సౌకర్యం అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. అయితే తమకు ఎక్కడైనా ఓ చోట 23 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే ప్రత్యామ్నాయంగా తాము అనుమతులు జారీ చేస్తామంటూ గతంలో అటవీశాఖ షరతులు విధించింది. ఈ షరతులపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు అప్పటి కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుపోగా భైంసా ప్రాంతంలో అటవీశాఖకు 23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కాగా నిబంధనలు మారాయని అంటూ మరోసారి అటవీశాఖ కొత్త మెలిక పెట్టింది. కొత్తచట్టం ప్రకారం తమకు కేటాయించిన 23 ఎకరాలకు తోడుగా మరో 23 ఎకరాలు ఇస్తేనే అనుమతులు జారీ చేస్తామంటూ స్పష్టం చేసింది. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లయ్యింది. అటవీశాఖ కోరుకున్న విధంగా అదనంగా 23 ఎకరాల స్థలం సేకరించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. అటు అటవీశాఖ, విద్యుత్‌శాఖ ఇటు రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో అదనపు స్థలం కేటాయింపు వ్యవహారమే కాకుండా విద్యుత్ సౌకర్యం అందించే విషయమై ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి.

కాంగ్రెస్ సర్కారు కరుణించాలంటూ వేడుకోలు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తున్న కాంగ్రెస్ సర్కారు తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటూ కడెం, పెంబి మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అటవీ శాఖ అనుమతులు ఎలాగైనా సాధించాలని వారంతా వేడుకుంటున్నారు. అటవీ శాఖ కోరుతున్న విధంగా ఎక్కడైనా అదనంగా స్థలం కేటాయించాలని ఆ గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు. తామంతా యేళ్ళ నుంచి కరెంటు సౌకర్యం కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికి అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ గోడును పరిష్కరించాలని పెంబి, కడెం, మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

మా గోడును పట్టించుకోండి : జైతు, కొసగుట్ట, పెంబి మండలం

చాలా ఏళ్ల నుంచి కరెంటు కోసం అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నాం. ఇప్పటి వరకు ఏ ఒక్కరూ తమ గోడును పట్టించుకోలేదు. తమ తల్లిదండ్రులు, తాము, తమ పిల్లలంతా చీకట్లోనే గడుపుతున్నాం. కాంగ్రెస్ తమ గోడును పట్టించుకోవాలి. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు స్పందించి కరెంటు సౌకర్యం కల్పించేందుకు సర్కారు ద్వారా కృషి చేయాలి.

వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతపేట్ గ్రామంలో గల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



విట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. విట్టాపూర్ గ్రామం పైలట్ గ్రామంగా ఎన్నికైనందున ఈ గ్రామానికి ప్రభుత్వం 55 ఇండ్లు మంజూరు చేసింది. అందులో 23 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం పనులు చేపడుతున్నారు. వారు కూడా నిర్మాణం పనులను వేగవంతం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మిగితా వారు కూడా ఇండ్ల నిర్మాణం పనులు సత్వరమే ప్రారంభించేలా చూడాలని లేని పక్షంలో వారి పేర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణంలో అలసత్వం లేకుండా అధికారులు బాధ్యతతో వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు నిర్మాణం పనులు పరిశీలించాలన్నారు. ఈయన వెంట హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీవో రహీం, ఎపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి సారిక, గ్రామస్తులు లబ్ధిదారులు ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేస్తా'



కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారతీయ జనతాపార్టీ బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు పసుల నవీన్ అన్నారు. శనివారం కుంటాల మండలంలోని అంబకంటి గ్రామంలో ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు వెంగల్‌రావు, మాజీ ఎంపీటీసీ, పలువురు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతాపార్టీ వైపు యువత మొగ్గు చూపుతున్నారని కావున రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

మహిళల ఆత్మ రక్షణకు కరాటే అవసరం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిత రామకృష్ణ

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆత్మ రక్షణకు కరాటే అవసరమని డాక్టర్ అనిత రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వివేక్ హైస్కూల్‌లో శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత రామకృష్ణ మాట్లాడుతూ... బాలికలకు మానసిక, శారీరక దృఢత్వానికి జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుటకు భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలనైనా ఎదుర్కొని గమ్యం చేరుకొనుటకు, ఆత్మవిశ్వాసం, మనోనిబ్బరం కలిగి ఉన్నత శిఖరాలను చేరుకొనుటకు ఇలాంటి కరాటే శిక్షణ చాలా అవసరమని చక్కని నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ నూకల విజయ్‌కుమార్, జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తేజందర్ సింగ్ బాటియా, వివేక్ హైస్కూల్ కరస్పాండెంట్ గంగ్రత్ రమేష్, అనురాధ పంపట్ వార్, మంచిర్యాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, సోలాపూర్ రాజేశ్వర్, మధుకర్ పంపట్ వార్, గన్నేరి ప్రభు, ఓటరికారి విద్యాసాగర్ కరాటే మాస్టర్, కిన్నెర్ల మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిది

- బాసర ఐఎఫ్ఎస్ అధికారి శరవనన్



విధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని బాసర ఐఎఫ్ఎస్ అధికారి శరవనన్ అన్నారు. శనివారం మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల అర్బన్‌పార్క్‌లో విధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖలో పని చేస్తున్నట్లు వంటి ప్రొటెక్షన్ వాచర్లకు బ్యాగ్, యూనిఫామ్ షూస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అటవీప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడం కోసం రూ.50వేలతో 50నీటి గుంతలను తవ్వించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నాగిని బాను విధి ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ ధీరజ్ కావేరి, డాక్టర్ విజయ కావేరి, టాస్క్‌ఫోర్స్ అధికారి వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో, రాథోడ్ అవినాష్, ఎఫ్ఆవో ఎండీ నజీర్‌ఖాన్, ఉప అటవీక్షేత్రాధికారి, వేణుగోపాల్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

మాదాపూర్‌లో కూరగాయల మార్కెట్ ప్రారంభం



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ... మాదాపూర్ గ్రామంలో ప్రతి శనివారం కూరగాయలతో పాటు మార్కెట్‌లో అన్ని రకాల దుకాణాలు అందుబాటులోకి ఉంటాయన్నారు. ప్రతి శనివారం జరిగే మార్కెట్‌ను మాదాపూర్ గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసులు వ్యాయామం చేయాలి : ఎస్పీ జానకీ షర్మిల



సెల్యూట్ చేస్తున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ సాయుధదళ ముఖ్య కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వీక్లీపరేడ్ అనేది సిబ్బందికి క్రమశిక్షణ, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయంలో దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యమని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్‌ను అనున్నితం కాపాడుకోవాలన్నారు. ఈ పరేడ్‌లో ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, ఆర్ఐలు రాంనిరంజన్‌రావు, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకకాలంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు



పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ



తల్వేద వద్ద ధ్రువపత్రాలు లేని వాహనాలతో పోలీసులు

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏకకాలంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పోలీస్ సిబ్బంది, జిల్లా ఏఆర్ సిబ్బందితో శనివారం సాయంత్రం ఒకేసారి నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సరైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకోవటం జరిగిందని తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లలో అసాంఘిక కార్యకాలాపాలను అరికట్టడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని, రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని వాహనాల వల్ల జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహాయం అందదని తెలిపారు.

ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో వాహనాల తనిఖీలు, అన్ని లాడ్జ్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రనే రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఒకేసారి నాకాబంది నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో అవినాష్ కుమార్ ఐపీఎస్, రాజేష్ మీనా ఐపీఎస్, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, ప్రొబేషనరీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరి మృతి



బసవరాజు (ఫైల్)

సోన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఎస్.బసవరాజు చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే బసవరాజు శుక్రవారం సాయంత్రం 04:30 గంటలకు చేపల వల తీసుకొని చేపట్టలు పట్టడానికి ఎస్సారెస్పీ డ్యాంలోకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతని గురించి కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం ఉదయం 8 గంటలకు ఎస్సారెస్పీ డ్యాంలో కాళ్లకు చేపల వల చుట్టుకొని బసవరాజు మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించి ఉంటాడని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. మృతుడికి ముగ్గురు కొడుకులు ఒక కూతురు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

తానూర్ , మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్‌కు తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త శ్రావణ్ తండ్రి ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదే విధంగా మండలంలోని దాగం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో నీలాబాయి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించి మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మాజీ జెడ్పీవైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మచైర్మన్ పోతారెడ్డి, కోలూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

భూ భారతి పైలట్ ప్రాజెక్టుకు

కుంటాల మండలం ఎంపిక

కుంటాల, మే, 3 : (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ భారతి పైలట్ మండలంగా కుంటాల మండలం ఎంపికైనట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. ఈ పథకానికి మండలం ఎంపికైనందున ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులకు ముగ్గురు తహసీల్దార్‌లు టీంగా ఏర్పడి ప్రతిరోజు రెండు, మూడు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ప్రజలకు సంబంధించిన ఏవైనా భూ సమస్యలు, పట్టా పాసుబుక్ సమస్యలు ఏవైనా ఉంటే అక్కడికక్కడే అధికారులు అర్జీలు స్వీకరిస్తారని ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోపరుచుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండలంలోని రాయపాడ్, మెదన్‌పూర్, ఓలా గ్రామాల్లో 5వ తేదిన, సూర్యాపూర్, అంబకంటి, లింబా (బీ) గ్రామాల్లో 6వ తేదీన రాజాపూర్, కుంటాల, వెంకూర్‌లలో 7వ తేదిన, లింబా (కే), కల్లూర్, విట్టాపూర్‌లో 8వ తేదిన, దౌనెల్లి, అందకూర్, పెంచికల్‌పాడ్‌లో 9వ తేదిన, అంబుగాంలో 12వ తేదీన ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నిప్పుల కొలిమి

- శనివారం జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఆరు మండలాల్లో రెడ్ అలర్ట్ జారీ
- నర్సాపూర్(జి)లో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

ఖానాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మరోసారి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా ఎండ దంచికొడుతోంది. శనివారం జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో అధికారులు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు. నర్సాపూర్(జి), భైంసా, దస్తురాబాద్, కుభీర్, కుంటాల, తానూర్ మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నర్సాపూర్(జి) మండలంలో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, సోన్ మండలంలో అత్యల్పంగా 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. మే నెల ఆరంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో రాబోయే నెల రోజులు పరిస్థితి ఎలా ఉండబోతుందోనని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 10 దాటిన తర్వాత సాయంత్రం నాలుగు గంటల లోపు అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి



గంగాసింగ్ (ఫైల్)

ముథోల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మహాలక్ష్మి గల్లీకి చెందిన ఠాకూర్ గంగాసింగ్(70) అనే వృద్ధుడు వడదెబ్బతో శుక్రవారం రాత్రి చనిపోయాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మృతుడు గంగాసింగ్ శుక్రవారం తన వ్యవసాయ చేనులో ఎరువు కుప్పలు చిమ్మేందుకు వెళ్లాడు. అయితే తీవ్రమైన ఎండల కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లి ఇంటికి తీసుకెళ్లారు. అంతలోనే మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మెరుగైన చికిత్స కోసం భైంసాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తానూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జౌల(బి) గ్రామానికి చెందిన సాటప్ప పటేల్ అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో శనివారం మృతి చెందినట్లు రైతులు తెలిపారు. రైతు యొక్క వివరాల ప్రకారం. . రైతు చేన్లో గాలితో విద్యుత్ తీగలకు షార్ట్ షర్క్యూట్ కావడంతో విద్యుత్ తీగలు తెగి పడి ఆవుపై పడడంతో అక్కడిక్కడే ఆవు మృతి చెందింది. రైతు విద్యుత్‌షాక్ ఏఈ ప్రదీప్‌కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పశువైద్యాధికారి డా. రాజేశ్‌కు తెలుపగా అతను ఘటన స్థలానికి వచ్చి పంచనామ నిర్వహించాడు. ఆవు విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి

నిర్మల్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని శనివారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. తద్వారా త్వరితగతిన కుల గణన పూర్తి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.